ప్రజాశక్తి
పశ్చిమగోదావరి

ఆదివారం
జనవరి - 7
2018
12 పేజీలు

చరిత్ర తెలిస్తేనే మనుగడ

ఎపి హిస్టరీ కాంగ్రెస్ సమావేశాల్లో చరిత్రకారులు

నరసాపురం వైఎన్ కళాశాల్లో ఘనంగా తొలిరోజు సమావేశం

ముఖ్య అతిథిగా పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్



వాణీమోహన్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, నరసాపురం

చరిత్ర తెలుసుకుంటనే భవిష్యత్తులో మనుగడ సాధ్యమని, చరిత్రకు అంతటి ప్రాధాన్యత ఉందని శనివారం నరసాపురం వైఎన్ కళాశాలలో జరిగిన తొలిరోజు ఎపి హిస్టరీ కాంగ్రెస్ సమావేశంలో చరిత్రకారులు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 42వ ఎపి హిస్టరీ కాంగ్రెస్ మహాసభలు తొలిరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతిప్రజల్వన చేసి సభలను ప్రారంభించారు. ఎపి, తెలంగాణ నుంచే కాకుండా పాండిచ్చేరి, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పురావస్తు శాఖ మ్యూజియం కమిషనర్ జి.వాణీమోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను వ్యక్తిగతంగా ఎన్నో చారిత్రక ప్రదేశాలను సందర్శించానని, ఈ రోజు పురావస్తు శాఖ కమిషనర్‌గా ఉండడానికి అదే ప్రధాన కారణమని చెప్పారు. తనకు చరిత్ర అంటే ఎంతో ఇష్టమని చరిత్రకారులు అందించే ఆధారాలు చారిత్రక పరిశోధనలు భావితరాలకు ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. చారిత్రక ఆధారాలను పురావస్తు వివరాలను డిజిటలైజేషన్ చేయాలని అభిప్రాయపడ్డారు. తద్వారా చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవచ్చన్నారు. విజయవాడ బాపు మ్యూజియంలో మన చరిత్రకు సంబంధించిన ఎన్నో అంశాలున్నాయని, ప్రస్తుతం పోలవరం సమీపంలోని రుద్రవేలిలో పురావస్తు తవ్వకాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ తవ్వకాల్లో ముఖ్యమైన అంశాలు వెలుగు చూస్తున్నాయని, మన రాష్ట్రంలో విజయవాడలోని మొగలరాజాపురం, ఉండవల్లి గృహలున్నాయని, వీటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పురావస్తు శాఖ నుండి ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌కు నిధులు మంజూరు చేయాలని ఆ సంఘ నాయకులు కోరగా దానికి నిధులు వచ్చేందుకు కృషి చేస్తానని వాణీమోహన్ హామీ ఇచ్చారు. ఈ సభల్లో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందని ఆమె అన్నారు. అనంతరం వాణీమోహన్‌ను వైఎన్ కళాశాల యాజమాన్యం గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ యల్లాప్రగడ సుదర్శనరావు అధ్యక్షత వహించారు. ఎల్లాప్రగడ సుదర్శనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ధ్యేయాలను తెలియజేశారు. అనంతరం వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ (4లో)



మాట్లాడుతున్న బలరాం

నీటి ఎద్దడి లేకుండా చూడండి

సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - గణపవరం

దాళ్వాకు సాగునీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం అధికారులను కోరారు. స్థానిక బిటి.రణదివే భవనంలో సిపిఎం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బలరాం మాట్లాడుతూ జిల్లాలో 25 శాతం నుండి 30 శాతం వరకూ ఇంకానాట్లు పూర్తికాలేదన్నారు. సాగునీరు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. పట్టిసీమ పేరుతో నవంబర్ నెలాఖరు వరకూ వరకూ గోదావరి నీటిని తోడడం వల్ల ఇప్పుడు ఈ నీటిఎద్దడి ఏర్పడిందన్నారు. వేరే ప్రాంతాల నుంచి నీటిని తెస్తామనడం సరికాదన్నారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారన్నారు. గోదావరిలో నీటి స్థాయి పూర్తిగా ఉన్నప్పుడు ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. జిల్లాలో ఒక ఎకరం కూడా ఎండనివ్వమని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందితప్ప, క్షేత్ర స్థాయిలో చర్యలు శూన్యమని విమర్శించారు.

రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తే వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు రుణ మాఫీ సక్రమంగా జరగలేదన్నారు. అన్నంపెట్టే రైతుకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. నోట్ల రద్దు తరువాత, జిఎస్‌టి వంటి విధానాలు రైతుల ఇబ్బందులను అధికం చేశాయని పేర్కొన్నారు. ఆక్వారంగంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఆక్వాసీడ్‌పై నియంత్రణ లేదని పేర్కొన్నారు. వాతావరణం మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు లేవని చెప్పారు. వేలకోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు ఊసే లేదని విమర్శించారు. రైతులు నేటి పరిస్థితుల్లో కూడా ఆత్మహత్యలకు పాల్పడటం ప్రభుత్వ సిగ్గుచేటు చర్యగా అభివర్ణించారు. ఈ రైతు సమస్యలన్నింటిపై వచ్చేనెల 10, 11, 12 తేదీల్లో భీమవరంలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. త్వరలోనే గణపవరం, నిడమర్రు మండలాల పరిధిలో రైతుసమస్యలపై రైతు సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు, గణపవరం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సిపిఎం సభ్యులు, నారపల్లి రమణారావు, గవర సత్యనారాయణ పాల్గొన్నారు.

మనోహరం.. హరికథా గానం

పల్లెల్లో.. డూడూ బసవన్నల సందడి

మధ్య పేజీల్లో..

గీతోపదేశం



మనదగ్గర లాక్కున్న భూముల్తో...
'రుణం'తీసుకొని.. మన రుణం మాత్రం మాఫీ చేయడం లేదురా..!!

స్పష్టమైన హామీ ఇవ్వండి

సిపిఎస్‌పై యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సాబ్జీ డిమాండ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

సిపిఎస్‌ను రద్దు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఈనెల తొమ్మిదో తేదీ నుండి వివిధ దశల్లో ఆందోళనలను చేపట్టనున్నామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ తెలిపారు. ద్వారకా తిరుమల యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2004 నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ కంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో 1.84 లక్షల మంది ఉన్నారని ఆయన తెలిపారు. వారందరికీ పాత పింఛను విధానం అమలవుతుందని, సుప్రీంకోర్టు దీన్ని స్పష్టం చేసిందన్నారు. కంట్రిబ్యూటరీ విధానం ద్వారా ఉద్యోగుల జీత భత్యాల నుండి పదిశాతం మినహాయిస్తూ మరో 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అయితే ఈ మొత్తం సొమ్మును ప్రభుత్వం షేర్ మార్కెట్‌లో పెట్టడం ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడడమేనని పేర్కొన్నారు. షేర్లు పెరిగితే ఫర్వాలేదు కానీ దివాళా తీస్తే మాత్రం పింఛను సొమ్ము పోయే ప్రమాదం ఉందన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుకోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపట్టేందుకు నిర్ణయించామని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీన అన్ని తాలుకా కేంద్రాల వద్ద, వచ్చేనెల పదో తేదీన అన్ని జిల్లా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

సిఎఫ్ఆర్‌డి నుండి బయటకు వచ్చే విధంగా ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహనరెడ్డి తాము అధికారంలోకి వస్తే సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ జగన్మోహనరావు, బి గంగరాజు, రంగాచారులు పాల్గొన్నారు.

కోడిపందేలను నిషేధించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఏలూరు

కోడిపందేలను నిషేధించాలన్న హైకోర్టు తీర్పును తప్పనిసరిగా అమలు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి జి.శివకుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలో జరిగే కోడిపందేలు, జూద క్రీడలను నివారించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టు కోడిపందేలు నివారించాలని తీర్పు ఇచ్చిందని, దాన్ని అమలు చేయాల్సిన ప్రజాప్రతినిధులే తాము కోడిపందేలను నిర్వహిస్తామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. గ్రామాల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి కోడిపందేల శిబిరాలపై నిఘా ఉంచాలన్నారు. జూద క్రీడల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు తీర్పుకు భిన్నంగా వ్యవహరించే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోడిపందేలు, జూదం వంటి విష సంస్కృతి నుంచి యువత దారిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే సంక్రాంతి క్రీడా సంబరాలను నిర్వహించాలని ఆయన కోరారు.

'ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఆమోదించాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఎస్‌సి వర్గీకరణ కోసం చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం స్థానిక ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు పలివెల చంటి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కోసం 24 ఏళ్లుగా ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. సిపిఎం నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ అక్రమ అరెస్టును ఖండించారు. ఎస్‌సి వర్గీకరణకు సిపిఎం అనుబంధ సంఘం సిఐటియు మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎంఆర్‌పిఎస్ చేస్తున్న పోరాటం న్యాయమైనదనీ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ బిల్లుకు ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బిజెపి నగర అధ్యక్షులు నాగం శివ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టేవరకూ ఎంఆర్‌పిఎస్‌కు బిజెపి మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, బిజెపి నగర ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, నగర దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసు, బిజెపి నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బిజెపి యువమోర్చా నగర అధ్యక్షులు సాయి, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

హెట్రోకు 35 మంది సిఆర్‌ఆర్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్‌రెడ్డి అటానమస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీన నిర్వహించిన హైదరాబాద్ హెట్రో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్‌విఎస్.ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.ఏడు వేల ఐదు వందల స్టయిఫండ్‌తో కూడిన 45 రోజుల శిక్షణ ఇస్తారని, అనంతరం ఆ సంస్థకు చెందిన హైదరాబాద్, విశాఖపట్నం విభాగాల్లో మూడేళ్ల పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం హెట్రోడ్రగ్స్ కంపెనీకి ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరెస్పాండెంట్ యుఎన్.రాంప్రసాద్, కెమిస్ట్రీ విభాగాధిపతి రాంబాబు, ప్లేస్‌మెంట్ సెల్ విభాగం సభ్యులు ఫణికుమార్, రాజారావు, రత్నాకర్, ఎలీషారాజు, కిషోర్ అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం





ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండువగా సాగింది. నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల 1969 పదో తరగతి బ్యాచ్ 50 మంది విద్యార్థులు రామకృష్ణాపురం సాహితీ మండలి కళ్యాణమండపంలో శనివారం కలిశారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులందరూ వారి కుటుంబసభ్యుల వివరాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పాఠశాల రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎంఎల్‌సి సూర్యారావు మాట్లాడుతూ 1969 బ్యాచ్ విద్యార్థులందరూ ఒకేచోట చేరుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుతం వీరిలో చాలామంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, బాల్యం నాటి మధుర స్మృతులను నెమర వేసుకున్న వైనం చాలా ఆహ్లాదకరంగా ఉందన్నారు. ఆరోగ్యంతో యువకుల్లా ఉత్సాహంగా ఉండాలని, కుటుంబ సమేతంగా సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు బి.పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులందరినీ సమీకరించేందుకు ఎంతో కృషి చేయాల్సి వచ్చిందన్నారు. తామంతా కలిసి చదువుకునే వారమని గుర్తు చేసుకున్నారు. అందరూ ఒకేచోట ఆత్మీయంగా కలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి హైదరాబాదు, విజయవాడ, ఖమ్మం ప్రాంతాల నుండి వచ్చారన్నారు. దీనిలో భాగంగా అప్పటి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులను సమీకరించేందుకు సహాయ సహకారాలు అందించిన వెంకటేశ్వరరావు, సత్యప్రసాద్, జనార్దన్‌లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సమ్మేళనానికి విచ్చేసిన విద్యార్థుల వయసు సుమారుగా 65 సంవత్సరాల పైబడి ఉన్నప్పటికీ రెట్టించిన ఉత్సాహంతో ఆనందంగా గడిపారు. స్వీయ చిత్రాలను సెల్‌ఫోన్లలో బంధించారు. బాల్యం నాటి సంగతులను నెమరేసుకుని, చివరిగా ఒకరికొకరు కరచాలనం చేసుకుని వీడ్కోలు పలికారు.

12న జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఏలూరు

సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన ఏలూరులో జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఏలూరులో సంక్రాంతి యువజనోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పండుగ సమయాల్లో యువత పెడదారి పట్టకుండా, చెడు వ్యసనాల వైపు మళ్లకుండా క్రీడా సంబరాలు దోహదపడుతున్నాయన్నారు. దీనిలో భాగంగా ఆర్ఆర్‌పేటలోని కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు ఇంటర్నేషనల్ రేటింగ్ ప్లేయర్ డి.లక్ష్మణరావు 8143561809ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.భరత్, కె.సుధీర్, మహిళా నాయకులు కనకం, కల్పన పాల్గొన్నారు.

సంస్కృతిని నేటి తరానికి అందించడమే లక్ష్యం



రంగవల్లులను పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తెలుగు ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలను నేటితరానికి తెలియజేసేందుకే ప్రతి ఏటా జుజ్జువరపు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్టు వ్యవస్థాపకులు జుజ్జువరపు జయరాజు స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక తొమ్మిదో డివిజన్‌లో ఆ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక కార్పొరేటర్ జుజ్జువరపు ప్రతాప్‌కుమార్, ఏడో డివిజన్ కార్పొరేటర్ పాలడుగు దీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత భోగి మంటను వేశారు. అనంతరం ముగ్గులను తిలకించారు. విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జుజ్జువరపు జయరాజు మాట్లాడుతూ నేటి తరానికి మన సాంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో నాలుగేళ్లుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతిగా కుట్టు మిషన్‌ను, ద్వితీయ బహుమతిగా గ్రైండర్‌ను, మూడో బహుమతిగా వాటర్ ఫిల్టర్‌ను, నాల్గో బహుమతిగా మిక్సీను బహూకరించినట్లు తెలియజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చీరను ఇచ్చినట్లు చెప్పారు. మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బిసి మహిళా సంఘం జాయింట్ సెక్రటరీ మోతికి రాఘవ, స్థానిక నాయకులు ఎల్లపు అచ్చారావు, కృష్ణ, సీత, సౌభాగ్యం పాల్గొన్నారు.

నేడు 'జన్మభూమి - మా ఊరు' 5కె రన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 5కె రన్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రారంభమై నగరంలోని హాయ్ హోటల్, పంపుల చెరువు, గొల్లయగూడెం బ్రిడ్జి, మినీ బైపాస్, జ్యూట్ మిల్, వసంతమహల్ హోటల్, కర్రలవంతెన మీదుగా సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నగర ప్రజలు, ఉద్యోగులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో

ఒ.ఎస్. నెం. 241/2017

మెస్సర్స్ పి.ఎస్.ఆర్. ఇన్వెస్ట్‌మెంట్స్
ప్రొప్రయిటర్: పి.శ్రీరాములు -వాది

మరియు

జయవరపు సాయిబాబు, S/o. సోమశేఖరరావు, హిందూ, నివాసం: కామయ్యపాలెం, జీలుగుమిల్లి మండలం, ప.గో॥జిల్లా. -ప్రతివాది

పత్రికా ప్రకటన

పై నెంబరు గ్రంధములో తమకు కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసు పంపించినను అవి మీరు తీసుకొనక త్రిప్పి పంపుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు తమకు నోటీసులు పత్రికా ప్రకటన మూలంగా తెలియచేయుటకు ఆర్డరు చేసియున్నారు. పై గ్రంధము ది. 09-01-2018 తేదీకి వాయిదా అయి వున్నది. కావున ఆరోజున మీరు స్వయముగా గాని, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 09-01-2018

బి.కృష్ణారావు
అడ్వకేట్, ఏలూరు

శ్రీ తణుకు 1st అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.320/2017 And I.A.313/2017

వాది - వెన్నేటి శ్రీనివాస్, తణుకు.
ప్రతివాది - షేక్ ఖాదర్ భాషా

వాది చేయించిన ప్రకటన

ప్రామిసరీ నోటు బాకీనిమిత్తం ప్రతివాది పై పై నెంబరు దావాను వాది దాఖలు చేయడమైనది. వాయిదా ది.8-1-2018 తేదీ అయినందున, సదరు వాది పగలు 10గంటలకు ప్రతివాది పై కోర్టు వారి యెదుట హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా : 8-1-2018

కె.ఎస్.సోమనాథరెడ్డి,
వాది తరపు అడ్వకేటు, తణుకు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS.75/2017

సనమండ్ర నాగమణి -వాది

మరియు

వెలగ పార్వతి మరియు యితరులు -ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన వెలగ పార్వతి, వెలగ వెంకటసుధాకర్‌బాబు, వెలగ డి.సత్యేంద్ర కుమార్ మరియు వెలగ శివసాయి ప్రవీణ్, కైకరం వాస్తవ్యులుకి ఎన్ని సార్లు కోర్టు ద్వారా దావా సమన్లు పంపినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు యిందు మూలముగా తెలియజేయునది ఏమనగా మీ పై, పై తెలిపిన వాది గారు ప్రోనోటు బాకీ వసూలుకు గానూ దావా వేసినారు గనుక మీరు ది.2-2-2018 తేదీన ఉదయం 10.30 ని॥ లగాయితూ మీరు స్వయంగానీ, ప్లీడరు గారి ద్వారా గానీ కోర్టులో వచ్చి ఆక్షేపణలు ఉన్నచో తెలియచేయవలసినదిగా కోరడమైనది. లేనిచో మీ పై పరోక్షముగా తీర్పు చెప్పబడును.

చిత్తగించవలెను,
బి.హెచ్.శేషు, అడ్వకేటు,
తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం,
ది.5-1-2018

In the Court of the Addl. Senior Civil Judge Court, Eluru

E.P. No. 132/2016 in O.S. No. 193/2014

Between:

State Bank of India, Eluru ...D.H.R
And
Polisetti Nageswara Rao ...J.D.R

To:

J.D.R. No-1: Polisetti Nageswara Rao, S/o. Narayana, R/o. D.No. 20-3-24/3, Near K.P.D.T. School, Ameena Pet, Eluru, W.G.Dist., CJCJC.

J.D.R. No-2: Katuri Koteswara Rao, S/o. Prakash Rao, R/o. D.No. 24B-10-27, Raghavachary Street, R.R.Pet, Eluru, W.G.Dist., CJCJC.

పై నెంబరు గ్రంధంలోని D.H.R Decree బాకీ వసూలు చేసుకొనుటకు దాఖలు చేసిన పై నెంబరు EP లో J.D.R. No.1, 2 కి ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. 8-1-2018 తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల పరోక్షంగా ఆర్డరు Pass చేయబడునని తెలియజేయడమైనది.

కె.వి.రామకృష్ణ
అడ్వకేటు, ఏలూరు

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు

ఇ.పి. నెం. 43/2007, ఓ.ఎస్. నెం. 3/2002

శ్రీమతి జల్లిపల్లి లక్ష్మి నరసమ్మ (డైడ్)
శ్రీ జల్లిపల్లి సుబ్రహ్మణ్యం -డి.హెచ్.ఆర్స్

మరియు

శ్రీమతి రసపుత్ర మంగమ్మ (డైడ్)
శ్రీ రసపుత్ర వెంకటకృష్ణ (డైడ్)
శ్రీ రసపుత్ర లక్ష్మీనారాయణ, వగైరాలు -జె.డి.ఆర్స్

వేలం ప్రకటన

పై నంబరు ఇ.పి. గ్రంధము డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు డి.హెచ్.ఆర్స్ జె.డి.ఆర్స్ తాలూకు షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయవలసినదిగా దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 29-1-2018వ తేదీన వేలం వేయుటకు నిర్ణయించినారు. కావున పాటలో పాల్గొనదలచినవారు పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్‌రిజిస్ట్రీ, ఏలూరు మండలం, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్, కందుకూరివారి తోట, టవున్ సర్వే నెం. 136లో 20.5 చ॥గ॥ల ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: జల్లిపల్లి సుబ్రహ్మణ్యం. దక్షిణం: రోడ్డు. పడమర: రసపుత్ర శివరాంబాబు ప్రస్తుతం పురెళ్ళ సుబ్బారావు. ఉత్తరం: నిమ్మగడ్డ రామమోహనరావు గారి యిల్లు. పై సరిహద్దుల మధ్య 200 చ॥గ॥ల్లో 20.5 చదరపు గజముల ఖాళీస్థలము.

డి.హెచ్.ఆర్. విలువ: రూ. 40,000/-లు
అమీనా విలువ: రూ. 40,261/-లు
రిజిష్ట్రీ ఆఫీసు విలువ: రూ. 17,000/-లు

ఎస్.వి.ఆర్.గాంధీ
డి.హెచ్.ఆర్ తరపున అడ్వకేట్
ఏలూరు
ఏలూరు
ది.3-12-2017

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పాలకోడేరు

భారీలోడుతో వెళ్తున్న ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం ముక్కలుగా విరిగిపోవడంతో విద్యుత్ వైరులు రహదారిపై వేలాడాయి. ఆ రహదారి పక్కనే గృహాలు ఉండడంతో వారంతా తీవ్ర భయందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం కలగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకోడేరు-వేండ్ర రహదారిలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీలోకి భారీ వాహనాలు వెళ్తుంటాయి. అయితే పాలకోడేరు దాటిన తర్వాత పేద లోగిల్లు సమీపంలో రహదారి పక్కగా కొంతమంది ఎన్నోఏళ్ల నుండి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పాలకోడేరు నుంచి వేండ్రకు భారీ లోడుతో వెళ్తున్న లారీ గుడెసెల సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం ముక్కలైపోవడంతో వైర్లు వేలాడాయి. ఈ విషయం తెలుసుకున్న ఆ గుడిసెల్లోని వారంతా రోడ్డుపైకి పరుగులు తీశారు. ఈ ఘటనలో ఏ ఒక్కరికీ అపాయం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. భారీ వాహనాలు రాకపోకలు నిలుపుదల చేయాలని అనేకసార్లు అధికారులకు చెప్పిన్నప్పటికీ పట్టించుకోవడం లేదని అక్కడివారు వాపోతున్నారు. గ్రామస్తులను భయందోళనకు గురిచేస్తున్న లారీలను దారి మళ్లించాలని సర్పంచి గాదిరాజు చంద్రవతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై సర్వత్రా విమర్శలు రేగుతున్నాయి.


లారీ ఢీకొనడంతో విరిగిన స్తంభం

రిటైర్డ్ పోలీసుల సూచనలు విలువైనవి

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రిటైర్డు పోలీసులు తమ సలహాలను, సూచనలను నేటితరం పోలీసులకు ఇవ్వాలని జిల్లా ఎస్‌పి ఎం.రవిప్రకాష్ కోరారు. స్థానిక అమీనాపేటలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నూతనంగా నిర్మించనున్న ది రిటైర్డు పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షులు భగవాన్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నిత్యం ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీసులు తమ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా మిగిలిన ప్రజానీకంతో చౌరవుగా కలవలేరన్నారు. రిటైర్టు పోలీసులంతా ఒక చోటకు చేరి కాలక్షేపం చేయడానికి ఒక అసోసియేషన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి నాలుగేళ్లు అయ్యిందని, కానీ ఇప్పటి వరకూ సొంత భవనం లేదని సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అసోసియేషన్ ఏర్పడిన సమయంలో జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రమేష్ రెడ్డి ఒక భవనాన్ని కేటాయించారని, వేరే చోట స్థలం ఇస్తే సొంత భవనం నిర్మించుకుంటామని, స్థలం కేటాయించాలని సభ్యులు తనను కోరారని, దీంతో స్థలాన్ని కేటాయించామని పేర్కొన్నారు. రిటైర్డు పోలీసులందరూ ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భగవాన్‌రాజు, దాశరధిలు మాట్లాడుతూ నూతన భవనం ఏర్పాటుకు స్థలం అడిగిన వెంటనే ఎస్‌పి రవిప్రకాష్ స్థలం కేటాయించడంతో పాటుగా శంకుస్థాపన కార్యక్రమానికి కూడా రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి మహేష్‌కుమార్, జిల్లా పోలీసు అధికారులు సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.నాగరాజు, రిటైర్డు ఆర్ఐ ఎంవివి.నాగేశ్వరరావు, ఏలూరు డిఎస్‌పి ఈశ్వరరావు, ఎఆర్ డిఎస్‌పి వాసన్, ట్రాఫిక్ డిఎస్‌పి భాస్కరరావు పాల్గొన్నారు.

దొంగతనం మోపారని వ్యక్తి ఆత్మహత్య


చంద్రయ్య మృతదేహం

ప్రజాశక్తి - నిడదవోలు

దొంగతనం నేరం మోపి గ్రామ పెద్దలు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తాడిమళ్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని బంధువుల కథనం మేరకు.. మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన కప్పల చంద్రయ్య (30) అదే గ్రామానికి చెందిన ఉప సర్పంచి నిజంపూడి వెంకటేశ్వరరావు వద్ద రోజువారీ కూలీగా పనిచేస్తుండేవాడు. చంద్రయ్య ఇంటి సమీపంలో కోడిపుంజులను, కొబ్బరికాయలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీనిపై ఆ గ్రామ పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రయ్య, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి ఈ దొంగతనాలకు పాల్పడ్డారని అనుమానించి, వారిని మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను శుక్రవారం రాత్రి ఆ గ్రామ శివారులో నిజంపూడి వెంకటేశ్వరరావు గేదెలు పాక వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన వారు ఈ విషయాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రవికుమార్ వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం ఎన్‌టిఆర్ కాలనీలో శనివారం రాత్రి కోడిపందేలు నిర్వహిస్తుండగా దాడిచేసిన పోలీసులు ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. వారినుంచి రెండు కోడి పుంజులను, రెండు కత్తులను, రూ.9,500 స్వాధీనం చేసుకున్నట్లు చేబ్రోలు ఎస్ఐ తాడి వెంకట నాగరాజు తెలిపారు.

ఏలూరు సిటీ:నగరంలో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక రాణీపేటలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు శనివారం మధ్యాహ్నం ఆ శిబిరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న రాణీనగర్‌కు చెందిన కోరాడ నాగరాజు, తంగెళ్లమూడికి చెందిన గంటా శ్రీనివాసరావు, ఇశ్రాయేలు పేటకు చెందిన నల్ల స్వామిలను అరెస్టు చేశారు వారి వద్ద నుండి రూ.ఎనిమిది వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ రామారావు హెచ్‌సి రత్నారెడ్డి పాల్గొన్నారు

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమ తల్లిదండ్రుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. బాధితుల కథనం మేరకు.. ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన గంగాధర వెంకటరమణ స్థానికంగా తాపీపనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన నరాల కష్ణవేణితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ విషయాన్ని పెద్దలకు తెలిపారు. అయితే వారి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో వారిద్దరూ కలిసి శుక్రవారం స్థానిక అంబేద్కర్ సమాజంలో వివాహం చేసుకున్నారు శనివారం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రేమజంట ఫిర్యాదును స్వీకరించిన ఏలూరు త్రీటౌన్ పోలీసులు వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కడుపునొప్పి తాళలేక..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కడుపునొప్పి తాళలేక ఓ యువతి ఎలుకలమందును నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక వంగాయగుడెం ప్రాంతానికి చెందిన కల్యాణి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. దాని నివారణకు ఓ ప్రయివేటు వైద్యుడి వద్ద మందులు కూడా వాడుతోంది. అయినా నొప్పి తగ్గడం లేదు. దీంతో శనివారం కడుపునొప్పి అధికంగా రావడంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటివద్దనే ఎలుకల మందును నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లి ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించింది.

అనారోగ్య కారణాలతో..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అనారోగ్య కారణాలతో ఓ వద్దుడు పురుగుల మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెదవేగి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతను కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను శనివారం ఇంటివద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరవాసరం

సంక్రాంతి పేరుతో ఎక్కడైనా కోడిపందేల నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని పాలకొల్లు రూరల్ సిఐ రజనీకుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోడిపందేలు నిర్వహిస్తారనే సమాచారం ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పందేలు నిర్వహణకు ఏర్పాటు చేసే బరులను ధ్వంసం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 18మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. వారినుంచి 84 కత్తులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. బెల్ట్‌షాపులు, గుండాట, పేకాటలపై నిషేధం ఉందని తెలిపారు.

బొర్రంపాలెంలో జన్మభూమి రసాభాస

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో శనివారం జరిగిన జన్మభూమి – మా ఊరు కార్యక్రమం రసాభాసగా సాగింది. టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక సినిమాథి యేటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి పోలవరం ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిపి శీలం వెంకటేశ్వరావు మాట్లాడుతూ బొర్రంపాలెంలో ప్రభుత్వాసుపత్రి శిథిలావస్థలో ఉందని దాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎంఎల్‌ఎని కోరారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ స్థానిక ఆరోగ్యకేంద్రానికి నూతన భవనాన్ని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు వేశామని చెప్పారు. అనంతరం ఆయన ప్రసంగాన్ని ముగించిన తరువాత గతంలో మంజూరు చేసిన నిధులు ఎమయ్యాయని, ఆసుపత్రి నిర్మాణం ఎందుకు ఆగిపోయిందని, సీసీ రోడ్లు పోస్తున్నామంటున్నారు... ఎక్కడ పోశారంటూ గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు కర్రి జక్రయ్య ఎంఎల్‌ఎను, ఇతర నాయకులను నిలదీశారు. దీంతో ప్రశ్నిస్తున్న నాయకులను కొందరు టిడిపి నాయకులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. దీంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు రంగంలోకి దిగి ఇరువురినీ బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

అభివృద్ధిని అడ్డుకోవద్దు : ఎంఎల్‌ఎ మొడియం

టిడిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడం పద్ధతికాదని పోలవరం ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాసరావు అన్నారు. బొర్రంపాలెంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో గొడవ సద్దుమణిగిన అనంతరం మైక్ అందుకుని ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఎలాంటి అభివృద్ధీ చేయలేదని గ్రామానికి ఎంఎల్ నిధులతో రూ.25 లక్షల, ఉపాది నిధులతో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు వేశామన్నారు. గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేశామని చెప్పారు. అదే విధంగా తిరుమలదేవిపేట నుండి వల్లంపట్ల అడ్డరోడ్డు వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.రెండు కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వచ్చే ఉగాది నాటికి అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు అందిస్తామన్నారు. కాంగ్రెస్‌లో చేయని అభివృద్ధి తమ ప్రభుత్వంలో చేశామని చెప్పారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్, రేషన్‌కార్డులు, గర్భిణులకు, సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శీలం వెంకటేశ్వరావు, జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు, జయవరపు శ్రీరామ్మూర్తి, సర్పంచి పొట్టేళ్ల అచ్చమ్మ, గాదె రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పిన్నమనేని మధు, గండబోయిన శ్రీను, తోట అక్ష్మినారాయణ, ఘంటా సతీష్, పేరుబోయిన శ్రీను, తహశీల్దార్ ఎన్.నాగరాజు, ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్ర తెలిస్తేనే మనుగడ

(మొదటిపేజీ నుంచి)

తమ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 42వ చరిత్ర వార్షిక సమావేశాలు జరగడం తమకెంతో గర్వకారణమని, ప్రతిఒక్కరూ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, చరిత్రను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. ఎపి చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.వెంకటరామయ్య మాట్లాడుతూ తనవార్షిక నివేదికను సమావేశానికి సమర్పించానన్నారు. అనంతరం ఎపి కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులు ఒకులాభరణం రామకృష్ణ మాట్లాడుతూ 1976 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర కాంగ్రెస్ నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతి కళాశాలలో ప్రారంభమయ్యాయని, ఈ సంస్థ ఎన్నో ప్రయాసలు పడి 41వ సంపుటిని ప్రచురించిందని తెలిపారు. అనంతరం 41వ సంపుటిని జి.వాణీమోహన్ ఆవిష్కరించారు. 41వ సభల ప్రొసీడింగ్స్‌ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ (ఎపిహెచ్‌సి) వెబ్‌సైట్‌ను ప్రొఫెసర్ సుదర్శనరావు ఆవిష్కరించారు. మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో ప్రతినిధులు తమ పరిశోధనలు వివరించి పత్రాలను సమర్పించారు. ఐదు విభాగాలుగా చరిత్రకారులకు సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జి.వెంకట రామయ్య, ప్రొఫెసర్ సోమశేఖర్‌రావు, వైఎన్.కళాశాల వైస్‌ప్రెసిడెంట్ జివికె.రామారావు, కోశాధికారి యర్రమిల్లి గోపాలకృష్ణమూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎఆర్ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వర్లు, ఎపి హిస్టరీ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ ఎస్.సోమశేఖర్, సిహెచ్. మల్లేశ్వరరావు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిని అందిస్తున్న రైతులు

'చింతలపూడి' రైతులకు రూ.30 లక్షల పరిహారమివ్వండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు రూ.30 లక్షల నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం న్యాయం చెయ్యాలని కోరుతూ మండలంలోని మల్లుకుంట గ్రామంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్వాసితుల పోరాట సమితి ఆధ్వర్యంలో చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం, టి.నసాపురం మండలాలకు చెందిన 70 మంది రైతులు పోలవరం ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తొలత మల్లుకుంటలో రైతులు చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రధానరహదారిపై కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో బొర్రంపాలెంలో జన్మభూమి కార్యక్రమాన్ని ముగించుకుని వల్లంపట్లలో జరిగే కార్యక్రమానికి వెళుతున్న ఎంఎల్‌ఎ వాహనాన్ని రైతులు అడ్డుకుని న్యాయం చేయాలని నానాదాలు చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఎల్‌ఎకు అందజేశారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్వాసిత పోరాట సంఘం అధ్యక్షులు అలవల ఖాదర్‌బాబురెడ్డి, పి.ముత్తారెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా నాలుగు మండలాల రైతులు న్యాయం కోసం పోరాడుతున్నారని పలు దఫాలుగా వినతిపత్రాలు అందించామని అయినా న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం సేకరిస్తున్న తమ భూములు సారవంతమైనవని రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ మట్లాడుతూ చింతలపూడి రైతుల సమస్య గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లానని మరోసారి ఆయనదృష్టికి తీసుకు వెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు జన్మభూమి కార్యక్రమం వరకూ నినాదాలు చేస్తూ వెళ్లి అక్కడ తమ ఫిర్యాదును నమోదు చేసుకున్నారు. ఈ ఆందోళనలో నాలుగు మండలాల రైతులు రావి ప్రకాష్, సాధనాల నరసింహారావు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, పి.వసంతకుమార్‌రెడ్డి ఉన్నారు.

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు



న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)
తిరుపతికి		
ఎయరిండియా	07.55	బుధవారం మినహా
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	10.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే

కోడి గుడ్ల ధరలు



విజయవాడ	రూ. 3.93
హైదరాబాద్	రూ. 3.98
ప.గోదావరి	రూ. 3.93
తూ.గోదావరి	రూ. 3.93
విశాఖ	రూ. 4.00
చిత్తూరు	రూ 3.98
చెన్నై	రూ. 4.05
నామకల్	రూ 3.90



బులియన్ మార్కెట్

24 క్యారెట్లు : 3,006(గ్రాము) : 30,006 (10గ్రా)

22 క్యారెట్లు : 2,818 (గ్రాము) : 28,180 (10గ్రా)

వెండి : 39.36(గ్రాము) : 39,360 (కిలో)

రైల్వే టైమ్‌టేబుల్

ఏలూరు నుంచి

రాజమండ్రి వైపు

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
12728	గోదావరి-హైదరాబాద్-విశాఖ	00.06	00.07
12740	గరీబ్‌రథ్-సికింద్రాబాద్-విశాఖ	02.41	02.42
18048	అమరావతి:వాస్కోడిగామా-హౌరా(సో,బు,శు,శ)	03.46	03.47
12738	గౌతమి-సికింద్రాబాద్-కాకినాడ పోర్ట్	04.06	04.07
17487	తిరుమల-తిరుపతి-విశాఖ	04.21	04.22
18510	ఎక్స్‌ప్రెస్-హెచ్-ఎస్ నాందేడ్-విశాఖ (సో,గు,శు)	04.41	04.42
18310	నాగావళి-నాందేడ్-సంబల్‌పూర్ (మ, బు, ఆది)	04.41	04.42
67300	ప్యాసింజర్-విజయవాడ-రాజమండ్రి	05.48	05.50
12718	రత్నాచల్-విజయవాడ-విశాఖ	06.51	06.52
12840	మెయిల్ -చెన్నయ్-హౌరా	07.26	07.27
18464	ప్రశాంతి-బెంగులూర్-భువనేశ్వర్	07.41	07.42
12862	లింక్-నిజాముద్దీన్-విశాఖ	07.51	07.52
13352	బొకారో-అలెప్పి-టాటానగర్	08.16	08.17
57225	ప్యాసింజర్-విజయవాడ-విశాఖ	09.47	09.48
12864	యశ్వంత్‌పూర్- యశ్వంత్‌పూర్-హౌరా	10.26	10.27
17239	సింహాద్రి-గుంటూరు-విశాఖ	10.34	10.35
22416	ఎపి ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ-విశాఖ	13.31	13.32
57257	ప్యాసింజర్-తిరుపతి-కాకినాడ	13.59	14.00
12806	జన్మభూమి-సికింద్రాబాద్-విశాఖ	14.27	14.28
11019	కోణార్క్-ముంబై-భువనేశ్వర్	15.08	15.09
17205	షిర్డీ- సాయినగర్ షిర్డీ-కాకినాడ టౌన్ (సో,బు,శు)	16.25	16.27
18646	ఈస్ట్‌కోస్ట్-హైదరాబాద్-హౌరా	17.38	17.39
57231	ప్యాసింజర్-విజయవాడ-కాకినాడ పోర్ట్	18.33	18.35
67261	ప్యాసింజర్-విజవాడ-రాజమండ్రి	19.46	19.47
57271	ప్యాసింజర్-విజయవాడ-రాయగడ	22.16	22.17
12704	ఫలక్‌నామా-సికింద్రాబాద్-హౌరా	22.26	22.27
	విజయవాడ వైపు		
12739	గరీబ్‌రథ్-విశాఖ-సికింద్రాబాద్	00.44	00.45
12703	ఫలక్‌నామా-హౌరా-సికింద్రాబాద్	01.39	01.40
11020	కోణార్క్-భువనేశ్వర్-ముంబై	03.06	03.07
22883	పూరీ-పూరీ-యశ్వంత్‌పూర్(శని)	03,34	03.35
67262	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	05.40	05.41
57272	ప్యాసింజర్-రాయగడ-విజయవాడ	07.04	07.05
57232	ప్యాసింజర్-కాకినాడపోర్ట్-విజయవాడ	08.00	08.01
17206	షిర్డీ ఎక్స్‌ప్రెస్-కాకినాడ-షిర్డీ (సో,బు,శని)	08.31	08.32
18645	ఈస్ట్‌కోస్ట్-హౌరా-హైదరాబాద్	09.25	09.26
12805	జన్మభూమి-విశాఖ-సికింద్రాబాద్	10.28	10.29
57258	ప్యాసింజర్-కాకినాడ-తిరుపతి	11.31	11.32
17240	సింహాద్రి-విశాఖ-గుంటూరు	12.08	12.09
22415	ఎక్స్‌ప్రెస్-విశాఖ - న్యూఢిల్లీ	12.26	12.27
13351	బొకారో-టాటానగర్-అలెప్పి	14.36	14.37
12863	హౌరా-హౌరా-యశ్వంత్‌పూర్	15.02	15.03
57226	ప్యాసింజర్-విశాఖపట్నం-విజయవాడ	15.50	15.52
12717	రత్నాచల్-విశాఖ-విజయవాడ	16.51	16.52
18047	అమరావతి-హౌరా-వాస్కోడిగామా(మ,బు,శు,ఆది)	16.58	16.59
18463	ప్రశాంతి-భువనేశ్వర్-బెంగుళూర్	17.31	17.32
17488	తిరుమల-విశాఖ-తిరుపతి	18.41	18.42
12861	లింక్-విశాఖ-నిజాముద్దీన్	19.33	19.34
67229	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	19.45	19.50
12727	గోదావరి-విశాఖ-హైదరాబాద్	22.01	22.02
12737	గౌతమి-కాకినాడపోర్ట్-సికింద్రాబాద్	22.56	22.57
18309	సంబల్‌పూర్-నాందేడ్(సో,మ,ఆది)	23.47	23.48
18509	ఎక్స్‌ప్రెస్-విశాఖ-నాందేడ్(మ,బు,శని)	23.47	23.48

పోలిశెట్టి ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నేటి ఉపాధ్యాయులందరూ ఎస్ఆర్.పోలిశెట్టిని ఆదర్శంగా తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి కోరారు. యుటిఎఫ్ జిల్లా వ్యవస్థాపకులలో ఒకరైన పోలిశెట్టి 17వ వర్ధంతి సభ స్థానిక ఫెడరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో గోపీమూర్తి మాట్లాడుతూ జిల్లాలో యుటిఎఫ్ అభివృద్ధికి పోలిశెట్టి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటితరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఐ.విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సీతారామరాజు, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ రామరాజు, సుధాకర్, కెఎస్ఆర్సిహెచ్.కుమార్, టి.సురేష్, సాయిరాం, డేవిడ్‌రాజు, ఎం.రవితేజ, కెవి.మల్లేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరావు, ఎం.రాజేంద్రబాబు, ఎం.శంకర్రావు పాల్గొన్నారు.


కెజిఆర్ఎల్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక కెజిఆర్ఎల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, స్టాఫ్, నాన్ టీచింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాచీన కళా వైభవ ప్రదర్శనలతో పాటూ మెహందీ, సాంప్రదాయ దుస్తులు, బొమ్మరిల్లులు, గొబ్బిళ్లు, పేరంటం, భోగి మంటలతో కన్నుల పండువగా సాగింది. న్యాయ నిర్ణేతలుగా ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు సతీమణి పులపర్తి సత్యవాణి వ్యవహరించారు. మెంటే రాణి రత్నకుమారి, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

సారూ.. ఓసారి చూడరూ..!


మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు - నిబంధనలకు తిలోదకాలు - రహదారి అస్తవ్యస్తం



అస్తవ్యస్తంగా మారిన రహదారి

ప్రజాశక్తి - వీరవాసరం

అధికారుల పర్యవేక్షణ లోపించడంతో మట్టి ట్రాక్టర్ల వేగానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. మండలంలో కొద్ది రోజులుగా విచ్చలవిడిగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. మట్టి ట్రాక్టర్ల వేగానికి స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ మట్టి లోడులతో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు ప్రయాణించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరవాసరం, కొణితివాడ, రాయకుదురు, మత్స్యపురి ప్రాంతాల్లోని లేఅవుట్ స్థలాల గోతులను పూడ్చేందుకు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి భారీ లోడులతో మట్టిని తరలిస్తున్నా అధికారులు మాత్రం ఆ వైపుగా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. ట్రాక్టర్ ట్రక్కుల్లో తరలిస్తున్న మట్టిపై ఎటువంటి బరకాలు వేయకపోవడంతో దారి పొడవునా మట్టి బెరడ్లు పడిపోతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే వీరవాసరం - మత్స్యపురి మార్గంలో మట్టి ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరగడంతో ఆ మార్గం పూర్తిగా ఛిద్రమైంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారి అస్తవ్యస్తంగా మారుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మట్టి రవాణా ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. పరిమితికి మించిన లోడు ఆపై మితిమీరిన వేగంతో మట్టి ట్రాక్టర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని వాపోతున్నారు. గతంలో వీరవాసరం - మత్స్యపురి మార్గంలో మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న మట్టి ట్రాక్టర్ వల్ల ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నప్పటికీ వీటి వేగానికి కళ్లెం వేసే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ అనుమతుల్లేని ట్రాక్టర్లను సీజ్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వాహనదారులపై కొరడా ఝుళిపించాలని వారు కోరతున్నారు.



భారీ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

యువజనోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆకివీడు

కోడిపందేలు,పేకాట, ఇతర జూద క్రీడలకు వ్యతిరేకంగా 35 ఏళ్లుగా నిర్విరామంగా రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ కార్యకర్తల కృషి అభినందనీయమని వైసిపి నాయకులు, ఎంపిటిసి సభ్యులు అంబటి రమేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల పదో తేదీ నుండి 17వ తేదీ వరకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న 35వ సంక్రాంతి యువజనోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. క్రీడల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎం.లెనిన్‌బాబు మాట్లాడుతూ యువజనోత్సవాల్లో రాష్ట్రం నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. మండల కార్యదర్శి డి.రాంబాబు మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి కోడిపందేలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య మండల అధ్యక్షులు డోకల రవితేజ, జి.ధనుష్, గేదెల అప్పారావు, కె.సుందరయ్య, టి.రాంబాబు, ఆర్.శివ పాల్గొన్నారు.

10 నుంచి మోగల్లులో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలం పరిధిలోని మోగల్లు గ్రామంలో ఈ నెల పదో తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ నాయకులు కారుమంచి క్రాంతిబాబు తెలిపారు. స్థానిక రంగా బొమ్మ సెంటర్‌లో ఆ సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత పెడదోవ పట్టకుండా నిర్వహిస్తున్న యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. దీనిలో భాగంగా ఈ నెల పదో తేదీ నుంచి 15వ తేదీ వరకూ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి క్రికెట్ టోర్నమెంట్‌కు అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు ఈ నెల తొమ్మిదో తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9000425614, 9533322223, 9966760511 నెంబర్లను సంప్రదించాలని కోరారు. టోర్నమెంట్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు సహకరించాలన్నారు. సమావేశంలో యువజనోత్సవాల కమిటీ సభ్యులు పి.రాజ్‌భాయి, సాంబ్రాణి సత్యనారాయణ, మనోజ్, సతీష్, మనేంద్ర, శివరామకృష్ణ పాల్గొన్నారు.

భీమవరంలో బాడీబిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా పట్టణంలో బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోతురాజు రామకృష్ణ తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి 17వ తేదీ వరకూ పోటీలు జరగుతాయన్నారు. ఈ స్థానిక గునుపూడి శ్వేత నర్సింగ్‌హోమ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లను బాడీ బిల్డింగ్ అసోసియేషన్, డివైఎఫ్ఐ సంయుక్తంగా శనివారం ఆవిష్కరించింది. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ యువత పెడదోవ పట్టకుండా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మెంటేవారితోట వండర్స్ కిడ్స్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న బాడీబిల్డింగ్ పోటీలను జయప్రదం చేయాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అల్లూరి అరుణ్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా జిల్లాలో ఆయా ప్రాంతాల్లో తమ సమాఖ్య ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలో బాడీ బిల్డింగ్ పోటీలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.2,500, రెండో బహుమతిగా రూ.రెండు వేలు, మూడో బహుమతిగా రూ.1,500లతో పాటు మిస్టర్ ఆంధ్ర స్పెషల్ బహుమతికి రూ.పది వేలను అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మారేడు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గోవింద్ బాబు, బాడీ బిల్డింగ్ నిర్వహణ కమిటీ కన్వీనర్ బిక్కిన శ్రీను పాల్గొన్నారు.

9న ఆకివీడులో భక్త కవి పోతన

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక కళా సాంస్కృతిక సంస్థ శారదా కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన మంగళవారం భక్త కవిత పోతన రంగస్థల పద్యనాటకం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఎంవి.సూర్యనారాయణరాజు, కొమ్ము సుబ్రహ్మణ్య వరప్రసాద్‌లు తెలిపారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కవిపోతన జీవిత చరిత్ర ఆధారంగా రచించిన నాటకాన్ని కళాభిమానులు ఆదరించాలని కోరారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో 'స్ఫూర్తి - 18' సింపోజియం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల 1, 2 తేదీల్లో 'స్ఫూర్తి-18' జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జి.పార్థసారథివర్మ తెలిపారు. శనివారం ఆ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సింపోజియం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జివి పద్మరాజు పాల్గొన్నారు.

లింకు రోడ్ల నిర్మాణానికి చర్యలు : మంత్రి పితాని

ప్రజాశక్తి - ఆకివీడు

మార్కెట్ యార్డుకు చెందిన 20 శాతం నిధులతో లింకు రోడ్లు, పుంత రోడ్లు నిర్మాణానికి ముఖ్యమంత్రి అంగీకరించారని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. మొత్తం నిధుల్లో 40 - 50 శాతం వరకూ లింకు రోడ్లకు వినియోగించుకునేందుకు ముఖ్యమంత్రిని అనుమతి కోరనున్నట్లు చెప్పారు. జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం సిద్ధాపురంలో ఆ గ్రామ సర్పంచి తోట శివాజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి పితాని మాట్లాడుతూ జన్మభూమి మాఊరు సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక అన్నారు. ప్రజలను చైతన్యపరిచి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వం ఈ సభలను నిర్వహిస్తోందన్నారు. సాగు, తాగునీటి సమస్యలను గుర్తించామని, వాటిపై చర్చించి పరిష్కార చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివ రామరాజు మాట్లాడుతూ గ్రామంలోని రోడ్ల నిర్మాణాలు, మంచినీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. కొల్లేరు గ్రామ సమస్యల పరిష్కారానికి సహకరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు, జిల్లా హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సాలి ప్రసాద్, మాజీ జెడ్‌పి ఛైర్మన్ జయరాజు, స్థానిక ఎఎంసి అధ్యక్షులు ఎం.రవి ప్రసాద్, ఎంపిటిసి సభ్యురాలు జి.లక్ష్మి, ఎంపిపి రామారావు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వడ్డి రాజ్యలక్ష్మి, జెడ్‌పి సభ్యురాలు మన్నె లలితాదేవి పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనం పైఅంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సామూహిక సీమంతాల్లో పాల్గొన్నారు.

వీరవాసరం : 'మీ పొలం గట్టుకొచ్చి పరిశీలించి సాగునీటి సమస్యలను పరిష్కరిస్తాను' అని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) రైతులకు హామీ ఇచ్చారు. జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం మత్స్యపురి, బొబ్బనపల్లి, మెంటేపూడి గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు పిప్పళ్ల నాని, మోపిదేవి విశేశ్వరరావు, కొల్లా సీతారత్నం అధ్యక్షతన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యపురిలో ఏర్పాటు చేసిన సభలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను ఎంఎల్ఎ అంజిబాబు దృష్టికి తీసుకొచ్చారు. బీటలు తీసిన నారుమడుల దుబ్బులను తీసుకొచ్చి సాగునీటి సమస్య తీవ్రతను తెలియజేశారు. పంట పండితేనే తాము అన్నం తినేదని ఎంఎల్ఎ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతుల నుద్దేశించి ఎంఎల్ఎ మాట్లాడుతూ సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకాధికారిని నియమించనున్నట్లు చెప్పారు. భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జన్మభూమిలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షడు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు), సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు యరకరాజు చినబాబు, నీటి సంఘాల అధ్యక్షులు యరకరాజు పెదబాబు, భోగిరెడ్డి గోవిందరావు, టిడిపి గ్రామాధ్యక్షుడు చింతా కనకయ్య, రాయపల్లి వెంకట్, తహశీల్దార్, ఎం.ముక్కంటి, ఎంపిడిఒ పి.జగదాంబ, పిఆర్ఎఇ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పితాని

పాలకోడేరు : గొల్లలకోడేరు అభివృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు ఆ గ్రామ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణరాజు విశేష కృషి చేస్తున్నారని స్థానిక శాసన సభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. గొల్లలకోడేరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఆ గ్రామ సర్పంచి సూర్యానారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ శివ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి అవసరాలకు అనుగుణంగా రూ.65 లక్షలతో ప్రణాళిక రూపొందించామని, త్వరలో నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రూ.రెండు కోట్లతో గ్రామంలో సిమెంట్ రహదారులు నిర్మించామని, దీనికి ఎంఎల్ఎ అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు నేతల బేబి, ఎంపిపి కునాధరాజు కృష్ణకుమారి, టిడిపి మండల అధ్యక్షులు కొత్తపల్లి గోపాలకృష్ణంరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు వీరాస్వామి, బంతెన నాగేశ్వరరావు, జన్మభూమి ప్రత్యేక అధికారి బిఎల్‌వి.ప్రసాద్, తహశీల్దార్ జి.రత్నమణి, ఎంపిడిఒ పి.వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని వెలివర్రు, చిలకూరు గ్రామాల్లో శనివారం ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలివర్రు గ్రామంలోని మంచినీటి సమస్య పరిష్కారానికి ఉండి కాలువ నుండి రూ.60 లక్షల వ్యయంతో పైపులైన్ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు, ఎఎంసి వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, ఎంపిపి దాలియ లక్ష్మి, ఎంపిడిఒ రెడ్డియ్య, ఎంఆర్ఒ వై.దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యావికాసం కార్యక్రమాన్ని 18వ వార్డులోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే ఉన్నత స్థితికి చేరగలరని చెప్పారు. కార్పొరేటు సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధనతో విద్యార్థుల సంపూర్ణ వికాసానికి దోహదపడుతున్నాయని కమిషనర్ తెలిపారు.

ప్రజాశక్తి
పశ్చిమ గోదావరి
ఆదివారం 7 జనవరి 2018

మనోహరం.. హరికథా గానం..

హరికథ.. చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జెలు, మెడలో పూలమాలతో హరిలో రంగ హరి అంటూ గంటల కొద్దీ నిలబడి హరికథ చెబుతారు శారద. ప్రేక్షకులకు విసుగు రాకుండా నృత్యం, హాస్యం చేస్తూ.. సామాజిక చైతన్యం కలిగిస్తూ భక్తి సాగరంలో ముంచెత్తుతారు. ఎంతో కష్టసాధ్యమయ్యే ఈ హరికథను సునాయాశంగా చెబుతూ అందరి మన్ననలూ పొందారు. తరగని కీర్తిని పొంది నేటితరం మహిళలకు, ఎంతోమంది కళాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు తాడేపల్లిగూడేనికి చెందిన హరికథా భాగవతారిణి కవురు శారద.

హరికథలో శారద ప్రతిభ

ఎన్నో పురస్కారాలు, సత్కారాలు



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం అర్బన్

భీమవరం సమీపంలోని నవుడూరు గ్రామంలో జన్మించారు శారద. తన తాత, తండ్రి కళాకారులు కావడంతో ఆ వారసత్వాన్ని కొనికిపుచ్చుకొని 8వ ఏటనే తండ్రి కవురు బ్రహ్మానందరెడ్డి ప్రోత్సాహంతో కళారంగంవైపు తన మొదటి అడుగు వేశారు శారద. సంగీతం మాస్టారు యాళ్లబండి తాతారావు వద్ద శిక్షణ పొందారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన శారద హరికథ గాన కళనే జీవనోపాధిగా ఎంచుకొని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఉన్నతస్థాయికి చేరుకున్నారు. 11వ ఏటనే తాడేపల్లిగూడెంలో ఈలి ఆంజనేయ కళా మందిరంలో మొట్టమొదటసారి గజ్జె కట్టిన శారద ఆ తరువాత వెనుతిరిగి చూడలేదు. ఒక పక్క కుటుంబ బాధ్యతలను మోస్తూనే తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని కాపాడే బాధ్యతలను కూడా తీసుకున్నారు. అంతరించిపోతున్న హరికథ కళను బతికించేందుకు దాదాపు 40 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తూ సుమారు 4000 లకు పైగా ప్రదర్శనలిచ్చారు. కొచ్చెర్ల రామకృష్ణ, యాళ్లబండి తాతారావు దగ్గర శిక్షణ పొందిన ఆమె సీతాకళ్యాణం, పార్వతి కళ్యాణం, భక్త మీరాబాయి, భక్త ధృవ చరిత్ర, భక్త ప్రహ్లాద, పాండవ సందేశం, శ్రీకృష్ణ రాయభారం, శ్రీరామ జననం, సుందరకాండ వంటి కథాంశాలపై హరికథలు చెప్పి అందరి ప్రశంసలు పొందారు. రాజశేఖర్, లక్ష్మీపతిరావు, భక్త ధ్రువ చరిత్ర హరికథలపై పరిశోధనలు చేశారు. అంతేకాదు పాండవ సందేశం, శ్రీ కృష్ణరాయభారం, భక్త మీరాబాయి, భక్త ధృవ చరిత్ర, ఆదిశంకరాచార్య, భక్తప్రహ్లాద, ఆదిభట్ల నారాయణదాసు జీవిత చరిత్రలపై హరికథ రచనలు స్టడీ చేశారు.

తెలుగు విశ్వ విద్యాలయంలో హరికథలో డిప్లమో చేసిన ఆమె 25 ఏళ్లకు పైగా ఆల్ ఇండియా రెడియోలో ఎ1 ఆర్టిస్ట్‌గా కూడా పని చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నో ప్రదర్శనలిచ్చారు. దూరదర్శన్‌తో పాటు వివిధ టెలివిజన్ ఛానళ్లలో హరికథ ప్రదర్శనలిచ్చారు. 'మా టివి'లో 'పాడాలని ఉంది' కార్యక్రమంలో ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు ఎస్‌పి.బాలసుబ్రమణ్యంతో కలిసి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. వివిధ సంస్థల ఆహ్వానం మేరకు బిలాయ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఖరగ్‌పూర్, భువనేశ్వర్, తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. పురుషులే ఎక్కువగా హరికథ కళాకారులుగా రాణిస్తున్న సమయంలో తనదైన శైలితో రాణిస్తూ దాదాపు నాలుగు దశబ్దాలుగా హరికథ ప్రదర్శనలిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రేక్షక హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.


దేవాదాయ శాఖా మంత్రి మాణిక్యాలరావుతో శారద


చిన్నప్పుడు హరికథా గానం చేస్తున్న శారద


శారదను సత్కరిస్తున్న సినీ నటులు జమున, అక్కినేని నాగేశ్వరరావు (ఫైల్)

ఎన్నో సన్మానాలు.. సత్కారాలు..

★అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఎంఎస్.సత్యనారాయణ, మాగంటి బాబు చేతులు మీదుగా సత్కారం.

★తిరుమల తిరుపతి దేవస్థానం త్యాగరాజు గాన సభ వేదికపై హైదరాబాద్‌లో శారదను అలనాటి సినీ నటి జమున, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి, నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు, పలువురు కళాకారుల సమక్షంలో సత్కరించారు.

★భద్రాచలం దేవస్థానం 'కథాగాన మోహన వంశీ' బిరుదుతో సత్కరించింది.

★తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంఘం ఆమెను ఘనంగా సత్కరించింది.

ఇలా ఎన్నో సత్కారాలు, సన్మానాలు భాగవతారిణి శారదను వరించాయి.

హరికథకు ప్రాముఖ్యత తగ్గుతోంది..

భాగవతారిణి శారద

ఎంతో పురాతన కళ అయిన హరికథను నేటితరం కళాకారులకు అందించాలన్నదే నా ధ్యేయం. మన దేశం ప్రాచీన కళలకు పుట్టినిల్లు. అటువంటిది రాష్ట్రంలో హరికథకు ప్రాముఖ్యత తగ్గిపోవడం బాధాకరం. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ప్రాజెక్టు ద్వారా హరికథకు ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ప్రభుత్వం హరికథ కళను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలి. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

వ్యాసరచనలో చిచ్చర పిడుగు..

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో దివ్య ప్రతిభ


అవార్డు అందుకుంటున్న విద్యార్థి పెచ్చెట్టి దివ్య

ప్రతిభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీయాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి చాలా అవసరం. ఈ కోవలోనే మాముడూరు హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న పెశ్చెట్టి దివ్య వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఈ మేరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించి అందరి మన్ననలు పొందింది.

మాముడూరు గ్రామానికి చెందిన పెచ్చెట్టి పెదబాబు, సూర్యకుమారి దంపతుల మూడో సంతానం దివ్య. చిన్నతనం నుంచి దివ్య ఆటపాటలతో పాటు చదువులో కూడా ముందుంటుంది. స్థానిక హైస్కూల్లో దివ్య 10వ తరగతి చదువుతోంది. 2017 డిసెంబర్ 24న జరిగిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో 50 మందితో పోటీ పడి ప్రథమస్థానం సాధించి అందరినీ అబ్బురపర్చింది. దివ్య వెన్నంటే ఉంటూ సలహాలు, సూచనలు ఇస్తూ తనదైన శైలిలో వ్యాసరచనపై మక్కువ పెంచిన ఉపాధ్యాయుడు టి.సాంబశివరావు. విద్యార్థి సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఇటీవల కాలంలో సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలపై, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల జీవిత చరిత్రలను వ్యాసరచన ద్వారా మలిచే విధానాన్ని దివ్యకు తరచూ సూచనలిస్తుండేవారు. దీంతో దివ్య తనశైలిలో సామర్థ్యాన్ని పెంపొందించుకుని వ్యాసరచన పోటీల్లో ఈ స్థాయికి వచ్చిందని పాఠశాల ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రస్థాయి అవార్డు..

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులు వ్యవహారాలు, పౌర సరఫరా శాఖ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో దివ్య ప్రథమస్థానం సాధించింది. అదేఅంశంపై గతేడాది డిసెంబర్ 29న విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ బహుమతి సాధించి ప్రతిభను చాటింది. ఈ సందర్భంలోనే విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పౌర సరఫరా శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ.ఎనిమిది వేల నగదు బహుమతి అందుకుంది.

పలువురి అభినందనలు

విజయవాడ కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో తృతీయస్థానం పొందిన పెచ్చెట్టి దివ్యను గ్రామ సర్పంచి కంకిపాటి లక్ష్మి, ఉప సర్పంచి బాబు, ఎంఇఒ డి. శారదాజోత్స్న, ఎస్ఎంసి ఛైర్మన్ ఎన్.కాంతారావు, ప్రధానోపాధ్యాయురాలు జె.సూర్యకుమారి, గైడ్ టీచర్ పితాని హరిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.


దివ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం


టీచర్ కావాలన్నదే నా కోరిక

పెశ్చెట్టి దివ్య, అవార్డు గ్రహీత

పదో తరగతి పూర్తయిన తరువాత ఇంటర్ చదివి భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుతాను. పెద్దయ్యాక టీచర్ అయి నలుగురికి పాఠాలు బోధిస్తాను. మంచి ఉపాధ్యాయినిగా అందరి మన్ననలు పొందాలని నా కోరిక.






బి.జ్ఞాన ప్రతిక్ష, 7 జనవరి 2016
కృష్ణవేణి, రఘువర్మ
బ్రాహ్మణచెరువు, పెనుమంట్ర (మం)

మీ చిన్నారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా.. ప్రజాశక్తి మంచి అవకాశం కల్పిస్తోంది.. మీ పదేళ్లలోపు చిన్నారి ఫొటో, పేరు, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా రాసి మాకు పంపితే ప్రతి ఆదివారం ఉచితంగా ప్రచురిస్తాం. సమాచారం పంపాల్సిన మెయిల్ ఐడి:prajabirthday@gmail.com లేదా సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో అందజేయొచ్చు.

పల్లెల్లో.. డూడూ బసవన్నల సందడి

జనవరి మాసంలో తెలుగువారంతా సంస్కృతీ సంప్రదాయాలతో ఆనందంగా జరుపుకునేది సంక్రాంతి పండుగ. ఈ పండుగ వచ్చిందంటే చాలు గ్రామాల్లో గంగిరెద్దులు, హరిదాసుల గానాలతో సందడి నెలకొంటుంది. దూరప్రాంతాల్లో ఉంటున్నవారు స్వగ్రామాలకు వస్తారు. కొత్త అల్లుళ్లు, కొత్తబట్టలు, నోరూరించే పిండి వంటలు, భోగిమంటలు, కోడిపందాలు ఇలా ఒకటేమిటి ఇంటింటా సందడి వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా పల్లెటూళ్లలో ఈ వాతావరణం ఎక్కువ కనిపిస్తుంది. రైతులు పండించిన పంట చేతికందడంతో ప్రతి ఒక్కరి చేతిలో కాస్త కూస్తో డబ్బు ఉంటుంది. ఈ క్రమంలోనే పండుగ పేరుతో కొందరు రకరకాల వేషధారణలతో వచ్చి ఇంటింటికీ తిరిగి పదోపరకో అడుగుతుంటారు. వారు కూడా సంతోషంగా దానం చేస్తారు.


పుల్లేపులో గంగిరెద్దును అలంకరించి ఇంటింటికీ తిరుగుతున్న గంగిరెడ్లవారు

గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

ప్రత్యేకం..

ప్రజాశక్తి - టి.నరసాపురం


జనవరి ప్రారంభం నుంచే కొందరు గంగిరెద్దులవారు ఎద్దులను రంగురంగుల వస్త్రాలతో అలంకరించి గ్రామాలు తిరుగుతూ వాటితో పలురకాల నాట్యాలు చేయిస్తూ, డోలు, సన్నాయి వాయిస్తూ విన్యాసాలు చేస్తూ అలరిస్తుంటారు. గ్రామస్తులు ఇచ్చే బియ్యం, ధాన్యం డబ్బులు, పాత బట్టలు ఇలా ఇచ్చినవి తీసుకెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటారు. ప్రస్తుతం జనవరి మాసం ప్రారంభం కావడంతో గంగిరెద్దుల విన్యాసాలు, హరిలో రంగహరి అంటూ హరిదాసుల గానాలతో మండలంలో సంక్రాంతి సందడి మొదలైంది. ఇప్పటికే మక్కినవారిగూడెం, టి.నరసాపురం, పుల్లేపు తదితర గ్రామాల్లో సంచరించామని, ఈ నెలాఖరుకు మండలంలోని గ్రామాలన్నీ తిరుగుతామని గంగిరెద్దులు ఆడించేవారు చెబుతున్నారు.


గంగిరెద్దును అలంకరించిన వైనం

గంగిరెద్దుల విన్యాసాలకు ఆదరణ కరువు..

ఒకప్పుడు గ్రామంలో గంగిరెద్దుల ఆటలంటే ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారని ప్రస్తుతం ఆ విన్యాసాలను ప్రజలు ఆదరించడం లేదని రాఘవపురానికి చెందిన మల్లన్న చెబుతున్నాడు. గతంలో గ్రామంలో ఒక ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడే గంగిరెద్దు నాట్యాలు నిర్వహించేవారమని, అప్పుడు ప్రజలందరూ అక్కడికి చేరి నాట్యం తిలకించి అనంతరం ఎవరికి తోచినది వారు ఇచ్చేవారని, అయితే ఇప్పుడు అటువంటి విన్యాసాలు చేసినా ఎవరూ రావడం లేదని, ఇంటింటికీ తిరిగి అడగాల్సి వస్తోందని, ఇదివరకటిలా కానుకలు రావడంలేదని వారు చెబుతున్నారు. ఏడాదిలో జనవరి నెలలోనే మాకు పని ఉంటుందని, తరువాత మమ్మల్ని పట్టించుకునే వారు ఉండరని దీంతో మా కుటుంబజీవనం దుర్భరంగా ఉంటుందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మాకు ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.

పండుగలోనే నాలుగు డబ్బులు..



టి.మల్లన్న, రాఘవాపురం

మాది చింతలపూడి మండలం రాఘవాపురం. మేమంతా 50 కుటుంబాల వరకూ ఉంటాం. సంక్రాంతి సీజన్‌లో ఊరూరా తిరిగి గంగిరెద్దులను ఆడిపాడిస్తుంటాం. సంక్రాంతి పండుగ రోజుల్లోనే కుటుంబాన్ని పోషించుకోవడానికి నాలుగు రూపాయలు వస్తాయి. అదే మాకు జీవనం. మిగిలిన రోజుల్లో ఎవరూ మమ్ముల్ని పట్టించుకోరు. రాను రాను మా కుల వృత్తి దుర్భరంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి మాకు ఉపాధి కల్పించాలి.

చిన్నారులు చదువుకు దూరం..

గంగిరెద్దులు ఆడించేవారి పిల్లలు కూడా చిన్నతనం నుండే అదే వృత్తిలోకి వెళ్తూ వారి బంగారు భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారు. చిన్న వయసులో ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వారు చదువుకు దూరమై తల్లిదండ్రులు నేర్పిన వృత్తిలో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేస్తూ గ్రామస్తులు ఇచ్చిన వాటిని తల్లిదండ్రులకు ఇస్తున్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రభుత్వాలు ఎన్ని పథకాలు పెట్టినా ఇలాంటివారిని పట్టించుకున్న వారులేరని, వారిని బడిలో చేర్పించిన వారులేరని పలువురు విమర్శిస్తున్నారు.

ఇదే వృత్తిలో గంగిరెడ్లవారి పిల్లలు బుచ్చియ్య, పిచ్చియ్య



వంగకు తెగులు.. రైతుకు దిగులు..

ఒడిదుడుకుల మధ్య సాగు - సోకిన పసుపుపేను పురుగు - ఆందోళనలో రైతులు

పెన్నాడ వంకాయ.. ఈ పేరు తెలియనివారు ఉండరు. రాష్ట్రంతోపాటు దేశ విదేశాల్లో సైతం ఈ వంకాయకు ఎంతోపేరు ఉంది. ఇంత పేరు గాంచిన వంకాయకు తెగుళ్లు వ్యాపించాయి. వంగసాగుకు పసుపు పేను పురుగు సోకడంతో రైతన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికందిన వంగ పంటను మడుల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


పసుపు పేను సోకిన వంగ మొక్కలు

వ్యవసాయం..

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ పంచాయతీ పరిధిలోని పెన్నాడపాలెంలో కాసే వంకాయలకు ఎక్కడాలేని డిమాండ్ ఉంది. మామూలుగా దొరికే వంకాయ ధరకు పెన్నాడలో కాసే వంకాయ ధరకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. మార్కెట్‌లో ఇవి పెన్నాడ వంకాయలేనా అని అడిగి మరీ కొంటున్నారంటే వీటికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది. రుచిలో ఈ వంకాయలకు సాటి లేదు. అయితే నేడు ఈ వంగతోటలకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పసుపు పేను సోకడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వాటి నివారణకు అనేక రసాయన ఎరువులు వాడినప్పటికీ ఫలితం ఉండడం లేదు. వేల రూపాయలు ఖర్చు చేసి ఎరువులు పురుగుల మందులు వినియోగిస్తున్నప్పటికీ తెగుళ్ల అదుపులోకి రాని పరిస్థితి నెలకొంది. అయితే దీనిమీదే ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి తెగుళ్ల సోకడంతో పంట ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారు తెచ్చి మడులుగా వాటిని నాటి అవి పెరిగి పంట కాసే సమయానికి పసుపు పేను రావడంతో వంగ మడులను వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో దిక్కు తోచక వంగ చెట్లను రైతులు నరికి వేరే పంట వేసుకుంటున్నారు. పెన్నాడ వంకాయకు ఎంతో పేరు ఉన్నప్పటికీ తెగుళ్ల ప్రతిష్టతను నాశనం చేసే విధంగా ఉన్నాయి. మార్కెట్‌లో రేటు ఉన్నప్పటికీ రానురాను కాపు తగ్గడం, దీనికి తోడు తెగుళ్ల కూడా వ్యాప్తి చెందడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తెగుళ్లను నివారించేందుకు వ్యవసాయ శాఖ దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.


పిందె దశలో ఉన్న వంకాయ మొక్కలు

ఎన్నడూ ఈ పరిస్థితి లేదు



కె.శ్రీను, వంకాయలపాలెం

నా చిన్ననాటి నుండి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. వంగ సాగులో ప్రస్తుతం పసుపు పేను తెగులు సోకింది. ఇన్నాళ్లలో ఏనాడూ ఈ పరిస్థితి లేదు. ఎన్ని పురుగుల మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. పెన్నాడ వంకాయకు ప్రతిష్ట పోకూడదనే ఉద్దేశంతో కష్టమైనా సాగు చేస్తున్నాం.

ఆసుపత్రిలో జనరిక్ మందులషాపు

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గట్టిం మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండేలా జనరిక్ మందుల షాపును ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల వైద్యులను పూర్తి స్థాయిలో నియమించి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. దీంతోపాటుగా ఆసుపత్రిలో ఉండే రోగులకు ఇబ్బంది లేకుండా 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు ఆసుపత్రి ప్రాంగణంలో జనరిక్ మందుల షాపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ షాపులో రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ షాపు ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యపరంగా, మౌలిక వసతులు విషయంలో ఇబ్బందులు ఉంటే సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే ఆసుపత్రిలోకి కావాల్సిన మౌలిక వసతులు విషయంలో ప్రజల సూచనలు సలహాలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రికి ఆశతో వస్తున్న రోగుల పట్ల వైద్యులు ప్రేమతో ఆదరించి సహనంతో వైద్యం అందించాలని సూచించారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంత గ్రామ ప్రజలు ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్న డయాలసిస్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ నెల 26న ఆసుపత్రిలో భారతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు బంగార్రాజు, వైద్యులు డాక్టర్ భూపతి, డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గట్టిం మాణిక్యాలరావు

ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి సభలు

ప్రజాశక్తి - భీమడోలు

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. మండలంలోని కోరుకొల్లు, కోడూరుపాడు పంచాయతీల్లో శనివారం నిర్వహించిన జన్మభూమి సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు విజయ, గంజి నాగేశ్వరరావు, నెక్కలపూడి వివి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు కె.పెద్దిరాజు, ఎంపి.పి ఎం.రామతులసమ్మ, తహశీల్దార్ ఎం.గంగరాజు పాల్గొన్నారు.

గణపవరం :ప్రజాసమస్యల పరిష్కారానికి జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని జల్లికాకినాడ, కేశవరం, ఎస్.కొండేపాడు గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదనరావు, ఎంపిడిఒ పద్మ, ఎఒ పార్థసారథి, టిడిపి మండలాధ్యక్షులు దండు వెంకట రామరాజు, టిడిపి రాష్ట్ర నాయకులు నాయుడు రామచంద్రరావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు అందించేలా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహర్ అన్నారు. శనివారం తణుకులోని ఐదు, ఆరు వార్డులో నిర్వహించిన జన్మభూమి మాఊరు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పరిమి వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకటసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ తోట సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరు:పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జన్మభూమి- మాఊరు ఉంగుటూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, కార్మిక శాఖ రాష్ట్ర కార్యదర్శి డి.ప్రసాద్ అన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమం మండలంలోని నారాయణపురం, కాగుపాడు, ఉంగుటూరు, తల్లాపురం గ్రామాల్లో ఆయా సర్పంచుల అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, సర్పంచులు ఉండ్రాజవరపు నాగమణి, గంటా శ్రీలక్ష్మి, కడియాల శుభశ్రీ పాల్గొన్నారు.

పెరవలి:జన్మభూమి మాఊరు కార్యక్రమం నల్లాకులవారి పాలెం, ముక్కాముల గ్రామంలో నిర్వహించారు. ముక్కాముల గ్రామంలో స్పెషల్ అధికారి లక్ష్మీపతి, ఎంపిడిఒ ఎస్‌టిఒ.రాజేశ్వరరావు, సర్పంచి అరిగెల అరుణకుమారి, బొడ్డు రామాంజనేయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:రూ.80 లక్షలతో ఈలి వరలక్ష్మి మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా 21వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బ్రహ్మాజీ, యర్రా నవీన్ పాల్గొన్నారు.

నిడదవోలు:ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరుతున్నాయా? లేదా? అనేది తెలుసుకునేందుకు జన్మభూమి సభలు ఎంతో ఉపయోగపడుతున్నాయని నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక 13, 15, 21వ వార్డుల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం.బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్లు సిపర్తి ప్రసన్న, ఉసుమర్తి సర్వస్వతి, వై.బాలారాజు పాల్గొన్నారు.

గోపాలపురం: జన్మభూమి కార్యక్రమం మండలంలోని దొండపూడి, కరిచర్లగుడెం, గుడ్డిగూడెం గ్రామాల్లో రసాభాసగా మారింది. కరిచర్లగుడెంలో గత జన్మభూమిలో ఇచ్చిన హామీలను ఎంతవరకూ పరిష్కరించారని ఎంపిటిసి వెలగా శ్రీరామ్మూర్తి ప్రశ్నించారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు స్పందించి తాము అభివృద్ధి చేశామని తెలిపారు. దొండపూడిలో రోడ్ల విస్తరణకు గానూ రోడ్డుకిరువైపులా ఖాళీ చేయించిన వారిలో 42 మందికి పట్టాలిచ్చారు. తమకు పట్టాలివ్వకుండా దొండపూడి వారికి ఇవ్వడంపై సాగిపాడు గ్రామస్తులు నిరసన తెలిపారు. దీంతో రసాభాసగా మారింది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితి చక్కదిద్దారు.

కొవ్వూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమం ఎంతోగానో ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్ అన్నారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి జవహర్ పాల్గొన్నారు. స్థానిక 13,14,17 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జె.రాధారాణి, కౌన్సిలర్లు రాజాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరపల్లి: ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని జెడ్‌పిటిసి సభ్యురాలు కె.సుధారాణి అన్నారు. మండలంలోని కురుకూరు గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కార్మికుల ఉపాధిని దెబ్బతీసే నిర్ణయాలు సరికాదు

కొనసాగిన తిరుమల డెయిరీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - భీమడోలు

తిరుమల డెయిరీ యాజమాన్యం కార్మికుల ఉపాధిని దెబ్బతిసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆ డెయిరీ వద్ద కార్మికులు చేస్తున్న ఆందోళన శనివారానికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్యం రవాణారంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనియన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతుందని అన్నారు. కార్మికుల ఆందోళనకు సిఐటియు మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఆర్.లింగరాజు మాట్లాడుతూ మూడు రోజులుగా 120 మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కోసం, సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. యాజమాన్య అనుకూల యూనియన్ తరపున కార్మికశాఖ కార్యాలయంలో తప్పుడు సంతకాలతో కార్మికులకు వ్యతిరేకంగా వినతిపత్రం ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ప్రజా ప్రతినిధుల, కార్మిక శాఖాధికారుల మాటలను యాజమాన్యం లెక్క చేయ్యకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల డెయిరీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్యామ్‌కుమార్, సిఐటియు డివిజన్ నాయకులు వై.సాల్మన్ రాజు, కె.వెంకటరావు, ఓంకారు, పద్మ, దుర్గా, మీనా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

సంప్రదాయ క్రీడలు నిర్వహించండి

ప్రజాశక్తి - గణపవరం

సంక్రాంతికి సంప్రదాయ క్రీడలైన ఆటల పోటీలను నిర్వహించుకోవాలని, కోడిపందేలను నిషేధించాలని గణపవరం తహశీల్దార్ ఎ.మధుసూదనరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదాయ క్రీడల నిర్వహణపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ క్రీడలైన కోకో, కబడ్డీ, షటిల్, ముగ్గుల పోటీలను సంక్రాంతికి పోటీలుగా నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, జూదం, గుండాట వంటి వాటిని నిషేధించామని చెప్పారు. ఎస్ఐ దావు హరికృష్ణ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందేలు, జూదం, గుండాట, అశ్లీల నృత్యాలను నిషేధించామన్నారు. అయినా నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, విఆర్ఒలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పద్మ పాల్గొన్నారు.

'రూట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనలో స్థానిక రూట్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారని, దీంతో త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారని ఆ స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనలో కె.రాజేష్, ఎంవిఎస్ఆర్‌కె.పంచముఖి ప్రతిభను చాటిందని తెలిపారు. ఆమెతోపాటుగా మరికొందరు విద్యార్థులు కూడా ప్రతిభను చాటారని తెలిఆరు. రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి నారాయణ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ఆ సంస్థ డైరెక్టర్ విద్యాకాంత్, ఎన్.సుధాకర్ వర్మ అభినందించారు.

మహాసభలను విజయవంతం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - భీమడోలు

భీమవరంలో వచ్చేనెల 10, 11, 12 తేదీల్లో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సిపిఎం భీమడోలు ఏరియా కన్వీనర్ ఆర్.లింగరాజు కోరారు. ఈ మేరకు భీమడోలులో ఏరియా కమిటీ సభ్యులు బెండి శ్రీనివాస్, కె.వెంకట్రావులతో కలిసి మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసేలా దిశ నిర్దేశంగా ఉంటాయని తెలిపారు.

నేడు నారాయణపురంలో 5కె రన్

ఉంగుటూరు:జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా ఈనెల ఏడో తేదీన జిల్లాస్థాయిలో 5కె పరుగు నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరుగును జిల్లా కలెక్టర్ భాస్కర్ ప్రారంభిస్తారని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.సత్యనారాయణ పేర్కొన్నారు. కళాశాల నుంచి చేబ్రోలు- గోపీనాధపట్నం మీదుగా ఆఫీసర్స్ క్లబ్ వరకూ పరుగును నిర్వహించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రథమ, ద్వితీయ స్థానాలు వచ్చిన వారికి నగదు బహుమతిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఆగడాలలంకలో స్వాస్థ విద్యావాహిణి

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆగడాలలంక గ్రామంలో స్వాస్థ విద్యావాహిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు మౌనిక, ఆనంద్, గీతాంజలి, సునీత, పిహెచ్‌సి సిబ్బంది సునీల్, కనకదుర్గ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ డిఎస్‌పి పి.భాస్కరరావు హెచ్చరించారు. నగరంలోని అజంతా సెంటర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ట్రాఫిక్ డిఎస్‌పి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడుగురు మందుబాబులపై కేసులు నమోదు చేశారు. ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువశాతం రోడ్డు ప్రమాదాలు వాటిల్లుతున్నాయని అన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సాధిక్ పాల్గొన్నారు.

'పోలవరం' కోసం నేటినుంచి మహా పాదయాత్ర : కాంగ్రెస్

ప్రజాశక్తి - కొవ్వూరు

పోలవరం కోసం కాంగ్రెస్ పార్టీ త్వరలో చేపట్టబోవు మహాపాదయాత్ర ఈనెల ఏడో తేదీన ధవళేశ్వరం నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ మాజీ ఎంఎల్‌సి గిడుగు రుద్రరాజు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కొవ్వూరులోని ఆర్యవైశ్య మండపంలో కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ విగ్రహం వద్ద నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ పాదయాత్ర ప్రారంభంలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి పి.నారాయణసామి పాల్గొంటారని తెలిపారు. ఏడోతేదీ సాయంత్రానికి పాదయాత్ర కొవ్వూరుకు చేరుకుంటుందని, కొవ్వూరులో రాత్రి బస చేస్తారని తెలిపారు. ఎనిమిదో తేదీ ఉదయం కొవ్వూరు నుంచి పాదయాత్ర ప్రారంభమై దొమ్మేరు మీదుగా కాపవరం చేరుకుంటుదని తెలిపారు. ఈ మహాపాద యాత్రలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పంతం నానాజీ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు రఫీ ఉల్లాబేగ్, కె.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆర్.సూర్యారావు, పి.సోమరాజు, ఎ.గోపీ పాల్గొన్నారు.

దేవరపల్లి : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు వెలగ రామకృష్ణ పిలుపునిచ్చారు. దేవరపల్లిలో శనివారం మహా పాదయాత్రకు సంబంధించిన బ్రోచర్లను, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరమని, 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయాలని, అదే విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఆర్థిక భారం లేకుండా కేంద్ర ప్రభుత్వమే పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రాజెక్టు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ నెల ఏడు, ఎనిమిది, తొమ్మిదో తేదీల్లో మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. తొమ్మిదో తేదీన పోలవరంలో సామూహిక సత్యాగ్రహ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్‌సి సెల్ మండల నాయకులు పాక చిన్నబ్బులు, డిసిసి కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల యువజన అధ్యక్షుడు ఆకుల నాని, నాయకులు పి.రాంగోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - భీమడోలు

నేడు విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ కోరారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివిధ అంశాలపై చర్చించేందుకు భీమడోలు మండలంలో పలు పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. భీమడోలు, గుండుగొలను, జెడ్‌పి హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, పాత పింఛను విధానం అమలుకు పోరాటాన్ని యుటిఎఫ్ ముందుండి నడిపిస్తుందన్నారు. ఈనెల తొమ్మిది, పది, మార్చి నెలల్లో చేపట్టే ఛలో అమరావతి ఉద్యమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులతో ఉపాధ్యేయతర పనులు చేయించ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం భీమడోలు మండల శాఖ సభ్యులు ప్రసాద్, జిజె.రవికాంత్, జి.బాల భాస్కర్, ఉపేంద్ర, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లపూడి

సిఎం సోమవారం తాళ్లపూడి పర్యటన సందర్భంగా ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలను తయారు చేసుకోవాలని కలెక్టర్ కాటంనేని భాస్కర్, కొవ్వూరు డిఎస్‌పి వెంకటేశ్వరరావుకు పలువురు సూచించారు. తాళ్లపూడిలో సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి కలెక్టర్ శనివారం తాళ్లపూడికి వచ్చారు. హెలీప్యాడ్, సభాస్థలాన్ని పరిశీలించారు. డిఎస్‌పి వెంకటేశ్వరరావుతో మాట్లాడుతూ పోలవరం నుంచి వచ్చే వాహనాలకు ప్రక్కిలంక ఇసుకర్యాంపు వద్ద, గోపాలపురం నుండి వచ్చే వాహనాలకు ప్రక్కిలంక సబ్‌స్టేషన్ వద్ద, కొవ్వూరు నుండి వచ్చే వాహనాలకు వేగేశ్వరపురంలో పార్కింగు ఏర్పాటు చేశామని, ఈ వాహనాల పార్కింగు విషయంలో ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు. సిఎం పర్యటన ఏర్పాట్లను రాజమండ్రి ఎంపీ మురళీమోహన్, ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్ జవహర్ పరిశీలించారు. అధికారులకు, నాయకులకు వారు పలు సూచనలు చేశారు. వారివెంట టిడిపి రాష్ట్ర నాయకులు జెవిఎస్.చౌదరి, నాయకులు పరమేశ్వరరావు, కొటారి వెంకట్రావు పాల్గొన్నారు.

దస్తావేజులతో స్థిరాస్తి సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థిరాస్తికి దస్తావేజులు ఉంటే సమస్యను పరిష్కరించుకోవచ్చని న్యాయ సలహా కేంద్రం న్యాయవాది కామన మునిస్వామి తెలిపారు. ఉండ్రాజవరం మండలంలోని న్యాయ సలహా కేంద్రంలో ఆయన శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థిరాస్తి విషయంపై వచ్చిన ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పి.మోహన్ తన పూర్వార్జితపు ఆస్తిలో ప్రభుత్వం సహకారంతో బిల్డింగ్ నిర్మించుకోవడానికి పాత తాటాకుల ఇల్లు తొలగించి దాని స్థానంలో నూతన భవంతిని నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఇల్లు తొలగించిన తర్వాత సరిహద్దు వారు తమ స్థలం కొంత కలిసిపోయిందని ఆరోపిస్తున్నారని చెప్పారు. కోర్టుకు వెళ్లి ఇంటి నిర్మాణాన్ని ఆపుతామని బెదిరిస్తున్నారని చెప్పారు. స్థలం దస్తావేజుల కూడా తమవద్ద లేవని మోహన్ వాపోయారు. దీనికి న్యాయవాది మునిస్వామి సమాధానం ఇస్తూ ప్రస్తుతం దస్తావేజు లేకపోయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకళ్లు పొందొచ్చని, లేకపోతే పెద్ద మనుషుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులకు స్థిరాస్తిని రాసి దస్తావేజును పొందొచ్చని మునిస్వామి సూచించారు. అదే విధంగా వివిధ సమస్యలతో వచ్చిన పలువురికి న్యాయ సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు మండే శ్రీను, కే.రాజబాబు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని ఎంవిఆర్ మాంటిస్సోరి డిఇడి కళాశాల డైరెక్టర్ ఎంఎల్ఎన్.రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంవిఆర్ బిఇడి కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అంతా విద్యపైనే ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలంటే ఉపాధ్యాయ శిక్షణ ముఖ్యమైందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ శిక్షణ ద్వారానే విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించగలుగుతామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నత శిఖరాలకు వెళ్లేలా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడి చదువుకున్న పాఠశాలలకు, తల్లిదండ్రులకు సొంత గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ జాన్‌పాల్, అధ్యాపకులు సీతాకుమారి, వసంతకుమారి పాల్గొన్నారు.



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

రోటరీ ఆధ్వర్యాన క్రీడాపోటీలు

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త సత్తి వేణుమాధవరెడ్డి, రోటరీ సెంట్రల్ అధ్యక్షులు కూచుపూడి వీర వెంకట రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 1500, 800, 400, 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, స్లో సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ క్లబ్ తరపున మహోత్సవ పేరుతో క్రీడాపోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, చింతల కిషోర్, ముళ్లపూడి వెంకట్రావు, రాఘవయ్య, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వృద్ధుల రక్షణకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

వృద్ధులపై జరిగే దాడులను, వివక్షను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బిసి కమ్యూనిటీ హాలులో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీర్రాజు మాట్లాడుతూ వృద్ధులపై జరిగే అకృత్యాలను అరికట్టేందుకు చట్టాలు కఠినతరం చేయాలని కోరారు. వృద్ధులకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని కోరారు. వృద్ధాప్య పింఛన్లను రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలకు పెంచాలని, పింఛనుదారులకు ప్రతి ఆరు నెలలకూ డిఎ పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా వెంపరాల నారాయణమూర్తి, గౌరవాధ్యక్షునిగా పరమేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వికె.వీరారావు, ఉపాధ్యక్షులుగా కె.రాంచంద్రరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొండ నిర్మలా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎఎన్ఎస్.సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శిగా అందే రంగారావు, కార్యవర్గ సభ్యులుగా బొబ్బిలి బంగారయ్య, మెంతె సోమేశ్వరరావు ఎన్నికయ్యారు.

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిడదవోలు

కెవిపిఎస్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ కమిటీ కన్వీనర్ బయ్యే వెంకట్రావు శనివారం స్థానిక అంబేద్కర్ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జువ్వాల రాంబాబు మాట్లాడుతూ సమాజంలో కుల నిర్మూలన, అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నక్కా వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు గంటి కృష్ణ, అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు గంటి శ్రీనివాసరావు, సత్యనారాయణ, సునీల్, పి.సురేంద్ర, కాట్రు వసంత్‌రాజు, ఎల్లే రాజు, పాల్గొన్నారు.

సిఎం సభలో ప్రత్యేక స్టాల్స్

ప్రజాశక్తి - తాళ్లపూడి


తాళ్లపూడిలో సోమవారం నిర్వహించనున్న జన్మభూమి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటున్న నేపథ్యంలో మత్స్యశాఖ తరపున ఐదు అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆ శాఖ డిడి ఫణిప్రకాష్ తెలిపారు. ఈ స్టాల్స్ ఏర్పాటు ప్రక్రియను పరిశీలించేందుకు ఆయన శనివారం సాయంత్రం తాళ్లపూడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ శాఖ ఇటీవల పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన పాండ్ ఆటోమెటిక్ మిషన్, బోర్డ్ ట్రాకింగ్ సిస్టమ్, విలువ ఆధారిత పదార్థాలు తయారు చేయడం, సముద్ర నాచు ఉత్పత్తి అనే ఐదు అంశాలపై సిఎం సభలో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో మత్స్య ఉత్పత్తి 11 లక్షల టన్నుల లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకూ ఎనిమిదిన్నర లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించామని అన్నారు. జిల్లాలో 28 మండలస్థాయి, 104 గ్రామ స్థాయి క్లస్టర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు యజమాన్య పద్ధతులు అమలు చేస్తున్నామని చెప్పారు. సముద్రంలో వేటకు వెళ్లేవారి రక్షణకు బోర్డు ట్రాసింగ్ సిస్టమ్‌ను నరసాపురంలో ప్రారంభించామని తెలిపారు. మత్స్యశాఖ తరపున అధిక దిగుబడులు పెంచేందుకు సంవత్సరంలో రెండు పంటలు తీసేందుకు కార్యాచరణ తయారు చేశామని తెలిపారు.

జన్మభూమిలో నిలదీతల పర్వం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్ విధానాన్ని అనుసంధానించిన తరువాత ప్రజలకు లబ్ధి చేకూరడం లేదంటూ మండలంలోని అంకన్నగూడెంలో నిర్వహించిన జన్మభూమి మాఊరు సభలో ఆ గ్రామ సర్పంచి మల్లం నాగలక్ష్మి భర్త వసంతరావు అధికారులను నిలదీశారు. మండలంలోని అంకంపాలెం, అంకన్నగూడెం పంచాయతీల్లో శనివారం జన్మభూమి సభలు జరిగాయి. అంకంపాలెం జన్మభూమి సభకు మండల ప్రత్యేకాధికారి షాజ్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో గృహ నిర్మాణాల నిమిత్తం వంద మంది అర్హులున్నారని, వారిలో పది మందికి కూడా మంజూరు కాలేదని వాపోయారు. ఇళ్లు నిర్మించుకునే వారికి సకాలంలో బిల్లులు రావడం లేదని అధికారులను నిలదీశారు. మండలంలోని పలు ప్రాంతాల్లో సిగ్నిల్ అందడం లేదని ఆన్‌లైన్ పద్ధతి తొలగించేశారని, ఏజెన్సీ మారుమూల గ్రామాలైన స్థానిక గ్రామాల్లో మాత్రం అమలు చేయడం దారుణమని వసంతరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఆన్‌లైన్ పద్ధతిని తొలగించాలని డిమాండ్ చేశారు. అసంబద్ధ విధానాలతో ప్రభుత్వ పథకాలు పేదలకు అందటం లేదన్నారు. జన్మభూమి సభలో ఆయా గ్రామ సర్పంచ్‌లు మల్లం నాగలక్ష్మి, కొరసా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

702 యూనిట్లకు రూ.2.72 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న హరేంద్రీయ ప్రసాద్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా ట్రైకార్ పథకంలో భాగంగా 702 యూనిట్లను పంపిణీ చేయనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఎంఎన్.హరేంద్రీయ ప్రసాద్ శనివారం తన కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 702 యూనిట్లకు రూ.2.72 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ట్రైకార్ పథకంలో మినిట్రాక్టర్, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ ఇంజన్, కూరగాయాల సాగుకు పందెర్లు, ఎద్దులు, కిరాణాషాపులు వంటి ఏర్పాటుకు లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు. 11వ తేదీన ఎంపిడిఒ కార్యాలయంలో లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంప్రదాయ క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులతో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోడిపందేలు, పేకాట వంటి జూద క్రీడలు వద్దని సాంప్రదాయ క్రీడలైన ఆటలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తుందని స్థానిక ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు. కోడిపందేల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో జూద క్రీడల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే క్రమంలో స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో జూదక్రీడలు నిర్వహించడం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. ప్రతిఒక్కరు జూద క్రీడలకు బదులు సాంప్రదాయ ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు, రైటర్ మహేష్ ఉన్నారు.

'సమస్యల పరిష్కార వేదికగా జన్మభూమి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని బయ్యనగూడెం గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించనున్న స్త్రీ సమాఖ్య భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతు బజారు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, జడ్‌పి వైస్ ఛైర్మన్ చింతల వెంకటరమణ, వైస్ ఎంపిపి పారేపల్లి శ్రీను, సర్పంచి గన్నాబ్రి చెంచయ్య, తెలుగు యువత గౌరవాధ్యక్షులు పారేపల్లి నరేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు వీరాస్వామి, వెలుగు సిసి కృష్ణ పాల్గొన్నారు.

గవరవరంలో..

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు అన్నారు. మండలంలోని గవరవరం గ్రామంలో ఎంపిడిఒ ఎం.రాజు, ఎర్రంపేట గ్రామంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి ఆధ్వర్యంలోనూ జన్మభూమి మాఊరు సభలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన, సర్పంచ్‌లు మద్దిపాటి రాజుకుమార్, గన్నమని కిరణ్మయి, ఎంపిటిసి సభ్యులు నల్లూరి ఏసుమణి, శ్రీదేవి, ఉప సర్పంచి గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాసరావు

బుట్టాయగూడెం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి మాఊరు గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉన్నాయని మండల వైస్ ఎంపిపి సున్నం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రాజానగరం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ఐదో విడత గ్రామ సభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార మార్గం చూపేందుకు జన్మభూమి గ్రామ సభలు ఉపయోగపడుతున్నాయన్నారు. గ్రామ సభలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. రాజానగరం కొరసవారిగూడెం గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ప్రత్యేక అధికారి టి.మోహనరావు, ఇన్‌చార్జి ఎంఆర్‌ఒ భాస్కర్, ఎంపిడిఒ ఎన్‌విఎస్.ప్రసాద్, ఇఒపిఆర్‌డి కె.జ్యోతి ఎపిడబ్ల్యుఒ సత్యనారాయణదొర, ఎంఇఒ టి.బాబూరావు, హౌసింగ్ డిఇ ఎ.రత్నంరాజు ఉన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు.

డివైఎఫ్ఐ కార్యక్రమాలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రానున్న రోజుల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరచాలని తహశీల్దారు జివివి సత్యనారాయణ ఆకాంక్షించారు. శనివారం స్థానిక భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయడం అభినందనీయమన్నారు. మండల కార్యదర్శి మాబు సుభాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నూతన సంవత్సరంలో విద్య, వైద్య సదుపాయాలను సక్రమంగా సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు గాడి శ్రీనివాస్, మునపర్తి అప్పారావు, పకీరం ఏడుకొండలు, షేక్‌లాల్, జిల్లా ఉపాధ్యక్షులు వంగా గోపి పాల్గొన్నారు.

శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరుద్యోగులు ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి అన్నారు. శనివారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, స్వార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో బార్‌బెండింగ్, ప్లంబింగ్ విభాగాలకు చెందిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరవేయడంలో మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి సుబ్బారాయుడు, కమిషనర్ కెవి.కొండలరావు, షేక్ ముస్తాఫా, చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో 'సీతా' జట్టుకు ద్వితీయస్థానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక సీతా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు క్రికెట్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ జూనియర్ కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ డి.వి.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ కెవి.విష్ణురాజు, రవి చంద్రన్, ఆదిత్య ప్రసాద్ రాజు, దశిక సూర్యనారాయణ, బిఎస్ కుమార్ రాజు అభినందించారు.

వెంకటపతిరాజు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- కొయ్యలగూడెం

ప్రతిఒక్కరూ సాంప్రదాయాలను ఆచరించాలని వెంకటపతిరాజు విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్‌ఆర్.సుభద్రాదేవి అన్నారు. శనివారం గవరవరం గ్రామంలోని ఆ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. తెలుగింటి రుచులైన 23 రకాల పిండి వంటలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారు సంక్రాంతి పండుగ సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్‌ఆర్.నరసింహరాజు, ప్రిన్సిపల్ మంగతాయారు, ఎన్.మధు, ఎస్‌కె.బాబా పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.సూర్యభగవాన్, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతులు అన్నారు. శనివారం మండలంలోని గవరవరం ఎర్రంపేట, రాజవరం, ఉంగుటూరు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించే ప్రాంతాలను వారు పరిశీలించారు. గవరవరం, ఎర్రంపేట గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


మాట్లాడుతున్న గోపీమూర్తి

సిపిఎస్ రద్దు చేసేవరకూ పోరాటం

ప్రజాశక్తి - పాలకోడేరు

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసేంత వరకూ పోరాటం ఆగదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.గోపీమూర్తి హెచ్చరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి పోరాటాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోరుతూ దశల వారీగా పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. పోరాటాలు చేసేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.విజయరామరాజు, జి.సుధాకర్ పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుపై దశలవారీ పోరాటాలు

పెన్షన్ సాధన సమితి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఎస్ రద్దు కోరుతూ చేపట్టనున్న దశలవారీ పోరాటాలను విజయవంతం చేయాలని పెన్షన్ సాధన సమితి పిలుపునిచ్చింది. సిపిఎస్ విధానాన్ని రద్దు కోసం గత నెల 16వ తేదీన విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో 'పెన్షన్ సాధన సమితి' ఐక్య వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ మేరకు ఈ నెల తొమ్మిదో తేదీన అన్ని పాత తాలూకా కేంద్రాల్లో చేపట్టనున్న ధర్నాలు, ఫిబ్రవరి పదో తేదీన జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న నిరసన ర్యాలీలను విజయవంతం చేసేందుకు స్థానిక పెన్షనర్ భవనంలో పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం సన్నాహక సమావేశం జరిగింది. దశలవారీ పోరాటాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెన్షన్ సాధన సమితి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి, ఎపిఎన్‌జిఒఎస్ భీమవరం తాలూకా సెక్రటరీ టి.గోపి, ఎపిఎన్‌జిఒఎస్ జిల్లా పూర్వపు అధ్యక్షులు కె.కామరాజు, క్లాస్‌ఫోర్ ఎంప్లాయిస్ భీమవరం తాలూకా అధ్యక్షులు జి.కృష్ణ, ఎపిపిఎంఎఇఎ అసోసియేషన్ జిల్లా కౌన్సిలర్ ఎ.కిషోర్‌కుమార్, టి.సోమయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

'భీమవరంలో రాజకీయాలు అస్తవ్యస్తం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని మాజీ ఎంఎల్ఎ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గ్రంధి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో వైసిపి జెండా స్థూపాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వస్తే మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో ప్రతీ కుటుంబానికి అందుతాయన్నారు. సభలో నాయకులు పేరిచర్ల విజయ నర్సింహరాజు, అల్లూరి రవికుమార్‌రాజు, ముదునూరి సత్యనారాయణ రాజు, గుద్దటి రవి కుమార్, యర్రంశెట్టి కృష్ణమూర్తి, తానింకి సత్యనారాయణ, తిరుమాని ఏడుకొండలు, చినమిల్లి వెంకట్రాయుడు, కొడే యుగంధర్, పెచ్చెటి సత్యనారాయణ, పేరిచర్ల సత్యనారాయణ రాజు, రేవూరి గోగురాజు, కైలా పాండు, గాదిరాజు తాతరాజు, కోమటి రాంబాబు పాల్గొన్నారు.

పంట కాల్వల్లోకి ఆక్వా చెరువుల నీటిని విడుదల చేస్తే..

షోకాజ్ నోటీసులిస్తాం : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరి పంట బోదెల్లో ఆక్వా చెరువుల నీటిని విడుదల చేస్తే ఆయా చెరువుల రైతులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పోలమూరు, గరువులో జన్మభూమి మాఊరు కార్యక్రమానికి మంత్రి పితాని సత్యనారాయణ విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం వంతులవారీ విధానం వల్ల దాళ్వా నారుమడులు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. పోలమూరులో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారన్నారు. సాగునీటి విషయంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు జాప్యం తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్వా చెరువుల కలుషిత నీటి వల్ల వరికి నష్టం వాటిల్లితే చెరువుల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు అందించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారులు జెఆర్ లక్ష్మీదేవి, గంగయ్య, ఎంపిడిఒ బి.రాంప్రసాద్, తహశీల్దార్ పి. వెంకట్రావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: పేద, బడుగు, బలహీనవర్గాల వారికి పింఛన్లు అందిస్తున్నామని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. భగ్గేశ్వరం, గోరింటాడ, పెదమామిడిపల్లి గ్రామాల్లో శనివారం 5వ విడత జన్మభూమి మాఊరు గ్రామ సభలను నిర్వహించారు. భగ్గేశ్వరంలో సర్పంచి కొయ్యే మాణిక్యం అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. అనంతరం మహిళలు, విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దాసిరాజు, ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, సర్పంచులు వెంకట రమణ, మధురమీనాక్షి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పితాని సత్యనారాయణ

నరసాపురం: పట్టణంలోని 10, 11, 12, 19వ వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాలు శనివారం జరిగాయి. ఆయా వార్డు కౌన్సిలర్లు అధ్యక్షత వహించారు. కొన్ని కార్యక్రమాల్లో ఛైర్‌పర్సన్ పసుపులేటి రత్నమాల హాజరయ్యారు. 18, 19వ వార్డుల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేసి గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో కామన బుజ్జి, జక్కం లక్ష్మీ సుధారాణి, తిరుమాని శశిదేవి, వెంకట శ్రీదేవి, అబేదా సుల్తాన్ పాల్గొన్నారు.

19వ వార్డులో జరిగిన జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో నరసాపురం ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. 19వ వార్డులో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమాని విమలతో పాటు తిరుమాని భవాని పాల్గొన్నారు.

మొగల్తూరు: జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలంటూ బాధితులు వినతిపత్రాలు అందించారు. కాళీపట్నం తూర్పు, కాళీపట్నం పడమరలో శనివారం జన్మభూమి, మాఊరు గ్రామ సభలను సర్పంచి మారుబోయిన సుజాతా అప్పారావు, కవురు ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యులు గుబ్బల నాగరాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి సంకు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోడూరు: పేదల సంక్షేమమే టిడిపి ధ్యేయమని మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. మండలంలోని శనివారం పి.పోలవరం, కవిటం, జగన్నాధపురం, పోడూరులో జన్మభూమి కార్యక్రమం ఆయా సర్పంచులు టి.బసవమ్మ, ఎ.అప్పాయమ్మ భాస్కర్, కె.చల్లారావు, కె. మోషేన్‌ను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కవిటం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు సైకిల్ షెడ్డు నిర్మించాలని మంత్రిని కోరారు. జూన్‌లో నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న బీమా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిసి ఛైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే.. విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ భీమవరం జిల్లా అధ్యక్షులు తుమ్మా దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద శనివారం పాలకొల్లు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ సెలవు దినాల్లో విద్యాసంస్థలు నిర్వహించడంపై విద్యాశాఖ అధికారులు స్పందించాలన్నారు. ప్రజాప్రతినిధులు నిర్వహించే సభల వల్ల విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామనే సాకుతో పబ్లిక్ హాలిడేలో తరగతులు నిర్వహించడం తగదని అన్నారు. ఈ సమావేశంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు జి.యుగంధర్, కె.నవీన్, కె.నవీన్ రాథోడ్, సిహెచ్ రవికిరణ్, కె.కిశోర్ పాల్గొన్నారు.

మొగల్తూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక లజపతిరాయపేటలోని ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో గుండె, ఎముకలు, కంటి, స్త్రీ వ్యాధులు, నరాలు, చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్ట్ డాక్టర్లు సుమారు 480 మంది రోగులను, 560 మంది విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 21 మంది పేషెంట్లను ఏలూరు ఆశ్రయం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం రిఫర్ చేశారు. సద్గురు నాన్నగారు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిబిరాన్ని పాలకొల్లు ఛాంబర్ గౌరవ అధ్యక్షులు వేగేశ్న రంగరాజు ప్రారంభించారు. ఈ సభకు ఛాంబర్ అధ్యక్షులు కొప్పు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు కనుమూరి రామకృష్ణంరాజు, కాస్మో క్లబ్ ట్రెజరర్ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పోలవరం కోసం కాంగ్రెస్ మహా పాదయాత్రలో భాగంగా శనివారం పాలకొల్లు లాకుల వద్ద కొలుకలూరి అర్జునరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కలిసి 2018-19 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి కొలుకలూరి అర్జునరావు పాలాభిషేకం చేసి వినతిపత్రం సమర్పించారు. అక్కడ నుంచి పాదయాత్రగా వెళ్లి తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో రొక్కాల బెన్నిపాల్, వై నామగిరి, నడింపల్లి అన్నపూర్ణ, బి. వెంకటలక్ష్మీ, రేపాక వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సభలకు విద్యార్థులను వాడడం సరికాదు'

పాలకొల్లు: పాలకొల్లులో రాజకీయ సభలకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విద్యార్థులను ఎక్కువగా వాడుకుంటున్నారని కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేత యడ్ల తాతాజీ విమర్శించారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులను చదువుకోనివ్వకుండా రాజకీయ సభలకు ఉపయోగిస్తున్నారన్నారు. నారా లోకేష్ పాలకొల్లు వచ్చిన సందర్భంగా ప్రయివేటు పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారని చెప్పారు. డ్వాక్రా మహిళలను బెదిరించి సమావేశానికి తీసుకొచ్చారని తెలిపారు. గ్రామాల్లో ఓడిఎఫ్ సర్వే కోసం విద్యార్థులను ఉపయోగించడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు ఖండవల్లి ఏసురాజు, తెన్నేటి చిన శ్యాములు, పసుపులేటి వీరాస్వామి, శివకుమార్, సనమండ శాస్త్రి, ఉండ్రావరపు శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యవరప్రసాద్ పుట్టినరోజు

పాలకొల్లు రూరల్ : పివి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ పుట్టినరోజు వేడుకలు శనివారం మండలంలోని వెలివల గ్రామంలో ఆయన స్వగృహం వద్ద అంబేద్కర్ యూత్, మాలమహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి రావు మాలమహానాడు జిల్లా అధ్యక్షులు గోడి పెద్దిరాజు, అంబేద్కర్ యూత్ అధ్యక్షులు పోతుమూడి సంపతరావు మాట్లాడారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో అంబేద్కర్ యూత్ నాయకులు బద్దె శ్రీను, తోకల నాగేశ్వరరావు, తోకల రవికుమార్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై చిన్నచూపు : వైసిపి

ప్రజాశక్తి - ఆచంట

దశాబ్దాలు గడిచినా విద్యా వ్యవస్థపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైసిపి విద్యార్థి విభాగం నాయకుడు అరిగెల సురేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో విద్యార్థి విభాగం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచంటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. మండల కేంద్రంలోని 12 గ్రామాల్లో విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. త్వరలోనే డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు పేరాబత్తుల భాస్కర నవీన్, నక్కా శివాజీ, జవజాల సూర్యకిరణ్, గూడవల్లి నవీన్, ఎన్. కిశోర్ పాల్గొన్నారు.

నేడు నరసాపురంలో 5కె రన్

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల ఏడో తేదీన నరసాపురం పట్టణంలో జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా నరసాపురం మున్సిపల్ కార్యాలయం నుండి వలంధరరేవు వరకూ 5కె రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పసుపులేటి రత్నమాల తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసాపురం ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పాల్గొంటారని ఆమె అన్నారు.

ఇంజేటి శ్రీనివాస్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - యలమంచిలి

కెవిపిఎస్ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ తల్లి ఇంజేటి చల్లాలు (90) శనివారం మృతి చెందారు. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారని బంధువులు తెలిపారు. చల్లాలకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతికి సిపిఎం పూర్వపు డివిజన్ కార్యదర్శి కేతా సూర్యారావు, మండల కార్యదర్శి బాతిరెడ్డి జార్జి, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు కానేటి బాలరాజు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాలపర్తి మాధవరావు సంతాపం తెలిపారు.

గుణ్ణం నాగబాబు వ్యాఖ్యలపై ఖండన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డులో వస్త్ర వ్యాపారుల నుంచి లక్షల సొమ్ము దుర్వినియోగం అయినట్లు గుణ్ణం నాగబాబు చేసిన ఆరోపణను ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తీవ్రంగా ఖండించారు. శనివారం ఎఎంసి ఆవరణలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ అవినీతి నుండి పుట్టిన వైసిపి నేతకు, నేతలకు ఏ కార్యక్రమం చూసినా అవినీతే కనబడుతోందని విమర్శించారు. ఎఎంసి నిధులను దుర్వినియోగపర్చాల్సిన అవసరం తమకు లేదని, పైగా ఎఎంసిలో ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా మరుగుదొడ్ల నిర్మాణం, అతిథి గృహాల్లో ఫర్నిచర్ ఏర్పాటు చేయడం, ఏసీలు ఏర్పాటు చేయడం వంటి వాటికి రూ.10 లక్షల వరకూ తన సొంత నిధులు ఖర్చు చేశామని తెలిపారు. ఎఎంసిలో జరిగే పనులను ఆ శాఖలోని డిఇఇ స్థాయి అధికారి నిర్ధారిస్తారని, పన్ను వసూలు దగ్గర నుండి అన్నీ సిబ్బందే చూసుకుంటారని, దానిపై పాలకవర్గానికి ఏమాత్రమూ అజమాయిషీ లేదని పేర్కొన్నారు. నిధులను దుర్వినియోగపర్చినట్లు బహిరంగంగా రుజువు చేస్తే తాను కూడా చర్యలో పాల్గొంటానని ఆయన సవాల్ విసిరారు. వస్త్ర వ్యాపారులు కరెంటు, విద్యుత్ వంటి సౌకర్యాలను వారే సమకూర్చుకుని పన్నులు చెల్లిస్తున్నారని, కేవలం 60 నుండి 70 మంది మాత్రమే ప్రతివారమూ వ్యాపారులు వస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎఎంసిలో వివిధ పనులకు పాలకవర్గం 18 తీర్మానాలు చేసినా ఉన్నతాధికారులు ఒక్కదానికి కూడా మంజూరు ఇవ్వలేదని, దీంతో రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా సౌకర్యాల ఏర్పాటులో తన సొంత నిధులు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు

అవినీతిని ప్రోత్సహిస్తూ కేవలం వైసిపి చిన్న నేతల వార్తలను పెద్దవిగా రాసి అధికార పార్టీ వార్తలను చిన్నవి చేసి రాస్తున్న ఓ పత్రిక విలేకర్లను తన సమావేశాలకు పిలవనని, ఆ పత్రికను బహిష్కరించాలని ఎఎంసి పాలకవర్గం నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ చిట్టూరి సీతారామాంజనేయులు, డైరెక్టర్లు బోడపాటి కాశీ, మైగాపుల శ్రీనివాస్, పీతల శ్రీను, జల్లి ఏసు, బాలి ఏడుకొండలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఆచంట వేమవరం సర్పంచి కనపాల స్వర్ణకుమారి అన్నారు. శనివారం 5వ రోజు గ్రామ సభలో మౌలిక సదుపాయాలు కార్యక్రమంపై పలు గ్రామాల్లో గ్రామ సభలు, చర్చా వేదిక జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సొమ్ము మీ హక్కు అని, అయితే పొదుపు సొమ్మును బ్యాంకుల నుండి తీసుకోవడానికి మహిళలకు లేకుండా పోయిందని ప్రభుత్వం బ్యాంకు అధికారులు పొదుపుపై సొమ్ము కూడా తీసుకునే సదుపాయాన్ని కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన స్టడీమెటీరియల్ పుస్తకాలను ఆమె అందజేశారు. పింఛన్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బికెడి ప్రసాద్, కనపాల వెంకటేశ్వరరావు, చేనేత సొసైటీ అధ్యక్షులు అందే గంగాధరుడు, ఎస్ఎంసి ఛైర్మన్ బొక్కా శ్రీను, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్, విఆర్ఓ గోపాలకృష్ణ, ఐకెపి ఎపిఎం జ్యోతిరాణి పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదాలకు దూరంగా ఉండాలి : సిఐ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాలకొల్లు సిఐ రజనీకుమార్

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూదాలకు దూరంగా ఉండాలని పాలకొల్లు రూరల్ సిఐ కె.రజనికుమార్ అన్నారు. యువత చెడు మార్గంలో ఉండకుండా ఉండేందుకు శనివారం స్థానిక ఎవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఐ ఎజిఎస్ మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సిఐ రజనికుమార్ బహుమతులు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు, హెచ్ఎం ఎం.రాంబాబు, లెక్చరర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న సిపిఎం నేతలు

పరిహారమివ్వాల్సిందే

జన్మభూమి సభలో అధికారుల నిలదీత

ప్రజాశక్తి - కుక్కునూరు

పూర్తి ముంపులో ఉన్న విలీన మండలాల్లోని 11 గ్రామాలకు పరిహారం ఇవ్వాల్సిందేనంటూ సిపిఎం నాయకులు జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో అధికారులను నిలదీశారు. మండలంలోని దాచారం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జన్మభూమి మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పరిహారంపై సిపిఎం మండల కార్యదర్శి ఎర్రంశెట్టి నాగేంద్రరావు అధికారులను నిలదీశారు. ముంపులో ఉన్న 11 గ్రామాలను పునరావాస పరిహారపు జాబితాలో మొదటిసారి మంజూరయ్యాయని, రెండోసారి జాబితాలో ఆ గ్రామాల పేర్లు లేకపోవడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు ఆ గ్రామాల్లోని ముంపులో ఉన్న భూముల రైతులకు పరిహారం ఇచ్చి పునరావాస పరిహారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. నిర్వాసితులతో కలిసి అనేకసార్లు రాస్తారోకోలు, ధర్నాలు, పాదయాత్రలు నిరాహార దీక్షలు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఆ గ్రామాలను జాబితాలో చేర్చి పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. ముంపు పేరుతో మండలంలోని మరుగుదొడ్లు, పక్కా గృహాలు, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు తదితర సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు సమయానికి అనుగుణంగా బస్సులు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నారని వెంటనే దాచారం నుండి కుక్కునూరు వరకూ సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని జన్మభూమి అధికారులను కోరారు. అధికారులను నిలదీసినవారిలో సిపిఎం నాయకులు పట్ల లక్ష్మయ్య, భద్రం, పంతులు పాల్గొన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ హరేంద్రీయప్రసాద్ మాట్లాడుతూ విలీన మండలంలోని నిర్వాసితులకు పునరావాస పరిహారం అందించేందుకు సమయం పడుతుందని చెప్పారు. పరిహారపు జాబితాలో జరిగిన అవకతవకలపై విచారణ చేపడతామన్నారు. తుదిజాబితా ప్రకటించాకే పరిహారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేకాధికారి రాఘవయ్య, ఎంపిడిఒ దుర్గాప్రసాద్, తహశీల్దారు రామాంజనేయులు, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల పట్ల పోలీసుల వైఖరి దారుణం

ప్రజాశక్తి - నరసాపురం

మొగల్తూరులోని నారా లోకేష్‌కు తమ గ్రామంలో ఆక్వా మెగా ఫ్యాక్టరీ వద్దని, దానిని దూరంగా తరలించాలని వినతిపత్రం అందించేందుకు వచ్చిన మహిళలపై పోలీసులు విరుచుకుపడడం, దుర్భాషలాడడం, అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి రాత్రి సమయంలో విడుదల చేయడం దారుణమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.కళ్యాణి అన్నారు. నరసాపురం పట్టణంలోని డిఎస్‌పి టిటి.ప్రభాకరబాబుకు వినతిపత్రం అందజేసేందుకు ఆమె నరసాపురం శనివారం వచ్చారు. డిఎస్‌పి అందుబాటులో లేకపోవడంతో డిఎస్‌పి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ లోకేష్‌కు వినతిపత్రం అందజేసేందుకు వచ్చామని చెప్పినప్పటికీ పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించారని, అక్రమంగా అరెస్టు చేసి ఆరేటి సత్యవతిని స్టేషన్‌లో ఉంచారని, దీన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందని ఆమె అన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు బాగా పెరిగాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పుగాకు పూర్ణ, తిరుమాని విమల, కవురు లక్ష్మి, తిరుమాని భవాని పాల్గొన్నారు.

నేటి తరానికి అన్నే ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అన్నారు. స్థానిక పవర్‌పేటలోని రైతు, వ్యవసాయకార్మిక, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యాలయంలో అన్నే వర్ధంతి సభ శనివారం జరిగింది. తొలుత అన్నే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. అనంతరం చింతకాయల బాబూరావు మాట్లాడుతూ మెట్ట, ఏజెన్సీ, కొల్లేరు ప్రాంతాల్లో రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై, భూ సమస్యలపై జరిగిన పోరాటాలకు అన్నే నాయకత్వం వహించారన్నారు. ప్రజాఉద్యమాల్లో 13 సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడిపి అందరి మన్ననలు పొందిన ధన్యజీవి అన్నే అని కొనియాడారు. అన్నే స్ఫూర్తితో ప్రజాఉద్యమాలను మరింతగా సమరశీలంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు నాయకులు బి.సోమయ్య, పి.కిషోర్, ఐద్వా నాయకులు కల్పన, హరీషాదుర్గ, కె.విజయలక్ష్మి, రైతుసంఘం నాయకులు కట్టా భాస్కర్‌రావు, కె.సుధీర్, చేతివృత్తి సంఘాల నాయకులు పి.ఆదిశేషు పాల్గొన్నారు.


అన్నే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు


విజేతలతో కొమ్మారెడ్డి రాంబాబు

విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి

సిఆర్‌ఆర్ విద్యాసంస్థల అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సిఆర్‌ఆర్ విద్యాసంస్థల అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. వారం రోజుల పాటు వట్లూరులోని సిఆర్‌ఆర్ మహిళా కళాశాలలో నిర్వహించిన గేమ్స్, లిటరరీ, సాంస్కృతిక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సిఆర్‌ఆర్ విద్యాసంస్థల గేమ్స్, స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌లోనూ సిఆర్‌ఆర్ మహిళా కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి ఎన్‌వికె.దుర్గారావు మాట్లాడుతూ చదువులోనే కాకుండా ఆటపాటలు, నృత్యాల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వంటల పోటీల్లో విద్యార్థులు చక్కని రుచులతో కూడిన వంటకాలతో నోరూరించారన్నారు. వచ్చే ఏడాది ఈ వారోత్సవాలు మరింత మెరుగ్గా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇంటర్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ సాధించిన ఎస్.దివ్య, జాతీయ స్థాయి కబడ్డీజట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిహెచ్.శ్రావణికి ప్రత్యేక బహుమతులు అందించారు. అలాగే డిగ్రీ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ సాధించిన ఎన్.సాయిభవాని ఇతర విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.శైలజ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కోడిపందేలకు ప్రజాప్రతినిధులే సిద్ధమవడం సిగ్గుచేటు : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

సంప్రదాయం పేరుతో కోడిపందేలు నిర్వహించేందుకు ప్రజాప్రతినిదులు సైతం సిద్ధం కావడం సిగ్గుచేటని సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం కోడిపందేలు నిర్వహించకూడదంటూ సర్క్యులర్లు జారీచేయడం, ఆర్భాట ప్రకటనలు ఇవ్వడంతో సరిపెట్టొద్దని ఆయన సూచించారు. సంప్రదాయం పేరుతో జూదక్రీడలను ప్రోత్సహించడం సరైందికాదని పేర్కొన్నారు. పండుగ అంటే జూదక్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంప్రదాయాన్ని ప్రోత్సహించడమంటే గ్రామీణ క్రీడలు, కళలను ప్రోత్సహించాలన్నారు. కోడిపందేలను సంప్రదాయం పేరుతో నిర్వహిస్తున్నామని చెబుతున్నవారు గతంలో మన భారత చరిత్రలో సతీసహగమనం, బాల్యవివాహాలు, అంటరానితనం వంటి దురాచారాలు కూడా సంప్రదాయంగా కొనసాగాయని వాటిని కూడా కొనసాగిస్తారా అని ప్రశ్నించారు. ఈ జూదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చిదిగిపోయి అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు సైతం కోడిపందాలు నిర్వహించకూడదంటూ తీర్పులు ఇస్తున్నప్పటికీ యథేచ్ఛగా ప్రతిఏటా జూదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం ఏమాత్రమూ పట్టీనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు స్వయంగా బరుల్లో ఉండి జూదాలను ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించకుండా కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉద్యమాల్లో మహిళల పట్ల ప్రభుత్వ వైఖరి దుర్మార్గం

మొగల్తూరులో మంత్రి నారాలోకేష్‌కు తుందుర్రు ఆక్వాఫుడ్‌పార్క్ వద్దంటూ విన్నవించేందుకు వెళ్లిన మహిళలపట్ల పోలీసులు తెలుగుదేశం పార్టీ నేతలు వ్యవహరించిన తీరును సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం తీవ్రంగా ఖండించారు. తుందుర్రు ఆక్వాఫుడ్‌పార్క్ గ్రామాలమధ్యన నిర్మించొద్దంటూ గత మూడున్నర సంవత్సరాలుగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం మొండిగా ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతోందన్నారు. మహిళలు ఉద్యమంలో పాల్గొంటుంటే తెలుగుదేశం పార్టీ నేతలు, పోలీసులు మహిళలను కించపర్చేవిధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఒంటిమీద దుస్తులు లాగి అవమానిస్తూ కించపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతియుతంగా సమస్యను వివరించేందుకు ప్రయత్నిస్తుంటే అరెస్టులు చేయించడం, రోడ్లపై ఈడ్పించడం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ విషయంలో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నిర్బంధాలతో అణచివేయాలని చూస్తోందని విమర్శించారు.

క్రీడాకారులకు కృషి, పట్టుదల ఉండాలి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే క్రీడలపట్ల ఆసక్తికనబరచాలని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎబివిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ క్రీడ కబడ్డీపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలని సూచించారు. కృషి, పట్టుదల ఉంటే ఏ క్రీడలోనైనా విజయం సొంతమవుతుందన్నారు. తెలుగుతనం ఉట్టిపడే క్రీడల్లో కబడ్డీ ఆట ఒకటి అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి మంచి ఆదరణ ఉందన్నారు. పండుగ సమయాల్లో యువత చెడువ్యసనాల బారినపడకుండా క్రీడలపై ఆసక్తి కనబరచాలని కోరారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. శారీరకదారుఢ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయన్నారు. అనంతరం కబడ్డీపోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను మంత్రి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సోమేశ్వరరావు, జికె.ఆనంద్, గోపాల్, నాగేంద్ర, బాపూజీ, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి మాణిక్యాలరావు

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెనుగొండ: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని దేవ పంచాయతీ పరిధిలోని పందెంరాయుళ్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.శ్రీనివాస్, దేవ సర్పంచి వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం: సంక్రాంతికి కోడిపందేలు నిర్వహించినా, కోడిపందేల నిర్వహణకు స్థలాలు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం తహశీల్దార్ జి.సూర్యనారాయణ రెడ్డి, నరసాపురంరూరల్ ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. పందేలు నిర్వహించే స్థలాలను తహశీల్దార్, రూరల్ ఎస్ఐ మండలంలోని సారవ గ్రామంలో పరిశీలించారు.

సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలు నిర్వహించాలని పట్టణ సిఐ సుబ్బారావు అన్నారు. స్థానిక సిఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.